టీడీపీలో పోటాపోటీ

• చంద్రబాబును కలుస్తున్న పలువురు నాయకులు • ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు • ఎమ్మెల్యే టిక్కెట్ల యోగం ఎవరికో..? • టీడీపీకి పెరుగుతున్న ఆదరణ • పడిపోతున్న వైసీపీ గ్రాఫ్



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీలో టిక్కెట్ల కోసం పోటీ పెరుగుతోంది. ఇప్పటికే రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న నాయకులే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న వారు, పారిశ్రామికవేత్తలు టికెట్లను ఆశిస్తున్నారు. ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలుస్తున్నారు. ఎలాగైనా టిక్కెట్ దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తూ చంద్రబాబుపైన ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సాధ్యాసాధ్యాలతో సంబంధం లేకుండా ఇబ్బడిముబ్బడిగా పాదయాత్ర సందర్భంగా హామీలు ఇచ్చారు. ఒక్క అవకాశం అంటూ అన్ని వర్గాల ప్రజలు జగన్‌కు జై కొట్టారు. ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన పాలన.. అనేక ప్రజావ్యతిరేక విధానాలతో రోజురోజుకు ప్రజల మద్దతు కోల్పోతోంది. ఇదే సమయంలో తమ సమస్యలు తీర్చలేదని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సంఘటిత, అసంఘటిత కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఇలా అన్ని వర్గాల వారు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టారు. నెల రోజులకు పైగా అంగన్వాడీలు సమ్మెలో ఉన్నారు. సమ్మె పరిష్కారానికి చొరవ చూపని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసేందుకు ప్రయత్నించింది. ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. మునిసిపల్ కార్మికులు, ఉద్యోగులు, సమగ్రశిక్ష ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి రోడ్డెక్కారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికార పక్షం గ్రాఫ్ రోజురోజుకు వేగంగా పడిపోతోంది. ప్రతిపక్షం గ్రాఫ్ రాకెట్ వేగంతో పెరుగుతోంది. టీడీపీ, జనసేన కూటమి ఏర్పడటం పట్ల కూడా అన్ని వర్గాల ప్రజల్లో సానుకూలత ఏర్పడుతోంది. ఈ పరిస్థితుల్లో టీడీపీలో టిక్కెట్ల కోసం రోజురోజుకు పోటీ పెరుగుతోంది. జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇప్పటికి కేవలం పీలేరు నియోజకవర్గంలో మాత్రమే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి టికెట్టును పార్టీ ప్రకటించింది. మిగిలిన అన్ని నియోజకవర్గాలలోనూ టిక్కెట్ల కోసం విపరీతమైన పోటీ నెలకొని ఉంది. కొన్నిచోట్ల ముగ్గురు, నలుగురు టిక్కెట్లను ఆశిస్తున్నారు.

టిక్కెట్ల కోసం పోటీ

జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన నాయకులు, పారిశ్రామికవేత్తలు, సామాజికవేత్తలు చంద్రబాబును కలిసి టికెట్టును ఇవ్వాలని కోరుతున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ టికెట్‌ను ఆశిస్తున్నారు. అదేవిధంగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి టీడీపీకి వస్తారనే పుకారు కూడా ఉంది. ఈయన టీడీపీలో చేరితే టికెట్‌ను ఆశిస్తారు. ఇటీవల పారిశ్రామికవేత్త జయచంద్రారెడ్డి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈయన ఎమ్మెల్యే టికెట్టును ఆశిస్తున్నారు. మదనపల్లెలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ టికెట్ రేసులో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాష గత ఏడాది యువగళం సందర్భంగా నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. మైనార్టీ కోటాలో ఈయన కూడా టికెట్టు కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు బీసీ కోటాలో టికెట్టును ఆశిస్తున్నారు. రానున్న రోజుల్లో ఇక్కడ మరిన్ని పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. రాయచోటి నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి ఇటీవల చంద్రబాబు సమక్షంలో పసుపు జెండా నీడకు చేరారు. ఇక్కడ ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే రమేశ్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబు, మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిలు టికెట్టును ఆశిస్తున్నారు. అయితే సుగవాసి బాలసుబ్రహ్మణ్యంకు రాజంపేట పార్లమెంటు టికెట్టును అధిష్ఠానం ఖరారు చేసినట్లు సమాచారం. దీంతో ఆయన సోదరుడు ప్రసాద్‌బాబు ఎమ్మెల్యే టికెట్టు రేసులో నుంచి పక్కకు తొలగినట్లయింది. ఈ నేపథ్యంలో రమేశ్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డిలు టికెట్టు కోసం ప్రయత్నిస్తుండగా ద్వారకనాథరెడ్డి రాకతో త్రిముఖ పోటీ ఏర్పడింది. అదే సమయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు మైనార్టీలు, బీసీ నాయకులు కూడా చంద్రబాబును కలిసి టికెట్టు కోరినట్లు తెలుస్తోంది. ఇక్కడ పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ టికెట్టు కోసం రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. టీడీపీ నాయకుడు గంటా నరహరి సైతం టికెట్టు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిద్దరే కాకుండా నియోజకవర్గానికి చెందిన పోలి సుబ్బారెడ్డి, మేడా విజయశేఖర్‌రెడ్డిలు కూడా చంద్రబాబును కలిసి పసుపు కండువా కప్పుకున్నారు. వారు కూడా టికెట్టును ఆశిస్తున్నారు. మేడా మల్లికార్జునరెడ్డికి వైసీపీ టికెట్టును నిరాకరించిన నేపథ్యంలో ఇంకా ఏవైనా అనుకోని మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉంది. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన రైల్వేకోడూరులో ఇన్‌చార్జ్‌గా కస్తూరి విశ్వనాథనాయుడు ఉన్నారు. ఇక్కడ గత ఎన్నికల్లో పోటీ చేసిన పంతగాని నరసింహప్రసాద్ టికెట్టును ఆశిస్తున్నారు. అయితే విశ్వనాథనాయుడు ఈసారి తెరపైకి కొత్త ముఖాన్ని పరిచయం చేయాలని అనుకుంటున్నట్లు సమాచారం. ఇక్కడ వైసీపీలో బలమైన నేతగా ఉన్న ముక్కా రూపానందరెడ్డి గురువారం విజయవాడలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. దీంతో ఇక్కడ టీడీపీ మరింత బలోపేతమవుతుంది. ఇప్పటి వరకు పై ఐదు నియోజకవర్గాలలో అభ్యర్థులు ఎవరన్న విషయంపై స్పష్టత రాలేదు. అయితే ఎలాగైనా టికెట్టును దక్కించుకోవాలనుకుంటున్న పలువురు నాయకులు అవకాశం దొరికిన ప్రతి సందర్భంలోనూ చంద్రబాబును కలుస్తూ టికెట్టు ఇవ్వమని కోరుతున్నారు. ఇంకా కొందరు తమకున్న మార్గాలలో చంద్రబాబుపైన ఒత్తిడి తెస్తున్నారు. ఈసారి టికెట్టు తెచ్చుకుంటే దాదాపు గెలుపు సాధ్యమనే భావన ఉండడంతో ఈసారి టీడీపీ టిక్కెట్ల కోసం పోటీ ఎక్కువ అయిందని చెప్పవచ్చు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

అభివృద్ధి చేయని ప్రభుత్వాన్ని గద్దె దించాలి

• నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జనవరి 20: ఐదేళ్లపాటు ఎలాంటి అభివృద్ధి చేయని వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని ప్రజలు విజ్ఞతగా ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన పత్తేగడ పంచాయతీ కొటాల గ్రామంలో బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ హామీలపై ప్రచారం నిర్వహించిన అనంతరం గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్టీయూ కాలేజీ చుట్టుపక్కల 1400 ఎకరాలను పరిశ్రమల కోసం సేకరించి పెడితే పదేళ్లయినా ఒక్క పరిశ్రమ కూడా రాలేదని చెప్పారు. అక్కడ పరిశ్రమలున్నట్లయితే వేలాది మంది యువతకు ఉపాధి లభించేదన్నారు. జేఎన్టీయూ కాలేజీలో ప్రస్తుతం ఎక్కడెక్కడి వారో ఉద్యోగాలు చేస్తున్నారని, స్థానికులకు మాత్రం అవకాశం లేకుండా చేశారని విమర్శించారు. స్వంత మనుషులకు పరాయి వారికి ఉన్న ఈ తేడాను గుర్తించాలని కోరారు. తాము ఏనాడూ రాజకీయ స్వార్థంతో గ్రామాల్లో కక్షలు, తగాదాలు పెట్టమని గుర్తు చేశారు. తమతో లబ్ధి పొందిన వారే తమను మోసం చేసి దూరమవుతున్నారని చెప్పారు. ఈ గ్రామంలో తమ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పించి ఎలాంటి పనులు చేయలేదన్నారు. తనకు స్వంత గ్రామంగా వున్న కొటాలలో ఎప్పటికీ అభివృద్ధి కోసమే కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అంతకు ముందు గ్రామానికి వచ్చిన కిశోర్‌కుమార్ రెడ్డికి గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. సమావేశంలో రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, కలికిరి, మర్రికుంటపల్లె, పత్తేగడ, మునేళ్లపల్లె సర్పంచులు ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రెడ్డిరాము, యల్లయ్య, శశికళ మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, మల్‌రెడ్డి, మాజీ సర్పంచులు మాలతి, అంజమ్మ, గ్రామ నాయకులు సల్లయ్య, చక్రపాణి, హేమాంబర, రెడ్డిరాజ, సాంబయ్య, కాశీవిశ్వనాథ్, దేవేంద్ర, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

27న పీలేరులో చంద్రబాబు సభ

• రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాయచోటి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పీలేరు పట్టణంలో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించనున్న రా..కదలిరా.. బహిరంగసభలో ఈనెల 27వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ఉంటుందని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ సభ ఈనెల 24వ తేదీ బుధవారం జరగాల్సి ఉంది. అయితే చంద్రబాబునాయుడు అయోధ్యలోని శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరవుతుండటంతో కార్యక్రమాన్ని 27వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. 27న జరిగే బహిరంగసభకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

సౌమ్యనాథాలయంలో కేంద్ర పర్యాటక శాఖ సలహాదారు

నందలూరు, జనవరి 20: నందలూరు సౌమ్యనాథస్వామిని పార్లమెంటు సభ్యుడు (రాజ్యసభ), కేంద్ర పర్యాటక శాఖ సలహాదారు సుమేర్‌సింగ్ సోలంకి శనివారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి ఘనంగా సత్కరించారు. ఈయన వెంట జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర నాయకులు నాగోతు రమేశ్‌నాయుడు, మైనారిటీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు షబ్బీర్, అహమ్మద్, అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, గిరిజన మోర్చ నేతలు పోతురాజు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథుని సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే: రాజంపేట మాజీ ఎమ్మెల్యే కసిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి శనివారం రాత్రి సౌమ్యనాథస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి తీర్థప్రసాదాలు అందజేసి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈయన వెంట ఆర్టీసీ మాజీ రీజనల్ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, ఆలయ మాజీ చైర్మన్ పల్లె సుబ్రమణ్యం, జనార్ధన్‌రెడ్డి, లంకయ్యగారి సుబ్బరామయ్య తదితరులు ఉన్నారు.



సౌమ్యనాథస్వామి ఆలయంలో కేంద్ర పర్యాటక శాఖ సలహాదారు

ఎస్‌ఈబీలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐల బదిలీ

మదనపల్లె టౌన్, జనవరి 20: జిల్లాలో ఎస్‌ఈబీ పోలీసు శాఖలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్‌ఈబీ కమిషనర్ రవికుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని లక్కిరెడ్డిపల్లె ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ విన్నిలతను ఆదోనికి, రాయచోటి ఇన్‌స్పెక్టర్ ధీరజ్‌రెడ్డిని మడకశిరకు, రాజంపేట ఇన్‌స్పెక్టర్ శ్రీహరిని చంద్రగిరికి, వాయల్పాడు ఇన్‌స్పెక్టర్ శివసాగర్‌ను గుత్తికి బదిలీ చేశారు. అలాగే పీలేరు ఇన్‌స్పెక్టర్ గురుప్రసాద్‌ను ధర్మవరానికి, చీకిలబైలు చెక్‌పోస్టు ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మమ్మను అనంతపురం డీటీఎఫ్‌కు, అన్నమయ్య ఇంటెలిజెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ నాగేంద్రమ్మను కదిరికి, ములకలచెరువు ఇన్‌స్పెక్టర్ మల్లికను సుంకేశుల చెక్‌పోస్టుకు, మదనపల్లె ఇన్‌స్పెక్టర్ మురళికిశోర్‌ను కణేకల్లుకు, రామసముద్రం చెక్‌పోస్టు ఇన్‌స్పెక్టర్ సరితారెడ్డిని లక్కిరెడ్డిపల్లెకు బదిలీ చేశారు. అదేవిధంగా జిల్లాలోని రాజంపేట ఎస్‌ఐ ఇస్మాయిల్‌ను ఆదోనికి, లక్కిరెడ్డిపల్లె ఎస్‌ఐ కిశోర్‌కుమార్‌ను ప్రొద్దుటూరుకు, రాయచోటి ఎస్‌ఐ థామస్ విన్సెంట్‌ను పంచలింగాల చెక్‌పోస్టుకు, రైల్వే కోడూరు ఎస్‌ఐ నరసింహరావును పులివెందులకు బదిలీ చేశారు. రాయచోటి డీటీఎఫ్ ఎస్‌ఐ హేమకుమార్‌ను మదనపల్లె డీటీఎఫ్ విభాగానికి, ములకలచెరువు ఎస్‌ఐ నారాయణస్వామిని కర్నూలు జిల్లా బాపురం చెక్‌పోస్టుకు, మదనపల్లె ఎస్‌ఐ అంజాద్‌బాషాను నంద్యాలకు, వాయల్పాడు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిని తిరుపతి డీటీఎఫ్‌కు, మదనపల్లె డీటీఎఫ్ ఎస్‌ఐ వై.బాబును సిద్దవటం స్టేషన్‌కు, మదనపల్లె బీఎంపీపీ ఎస్‌ఐ రాజశేఖర్‌ను కర్నూల్‌కు, చీకిలబైలు చెక్‌పోస్టు ఎస్‌ఐ శివకృష్ణమ్మను ఎమ్మిగనూరు బీఎంపీపీకి బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వారి స్టేషన్లకు రిలీవర్లు వచ్చిన వెంటనే బదిలీ అయిన స్థానాల్లో చేరాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కార్మిక వర్గంతో షాక్ తప్పదు

• హామీలు నెరవేర్చమంటే బెదిరింపులా.. • ప్రభుత్వంపై అంగన్వాడీల ఆగ్రహం



సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు, సీపీఎం నాయకులు



బి.కొత్తకోట జ్యోతిబస్టాండు కూడలిలో అంగన్వాడీల మానవహారం

రాయచోటి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఒక అవకాశం ఇవ్వండి.. ఎంతో అభివృద్ధి చేస్తానంటే... నమ్మి ఓట్లేసిన పాపానికి మమ్మల్ని నట్టేట ముంచాడు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడిగితే తొలగిస్తామని బెదిరింపులా.. రాబోయే రెండు నెలల తర్వాత కార్మికవర్గంతో రాష్ట్ర ప్రభుత్వానికి షాక్ తప్పదు అంటూ అంగన్వాడీ కార్యర్తలు జగన్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమైన తమ సమస్యలు పరిష్కరించమని డిమాండ్ చేస్తూ 40 రోజులుగా సమ్మెలో ఉన్న తమపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష్య పూరితంగా వ్యవహరిస్తోందని అంగన్వాడీలు ఆవేదన చెందుతున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు తమ ఆందోళనను కొనసాగించారు. రాయచోటి కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నాను కొనసాగించారు. కార్మిక, రైతు, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బంగ్లా సర్కిల్ వద్ద అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథనాయక్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధం కన్వీనర్ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు. వాల్మీకిపురంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు రాస్తారోకో చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కుటుంబాలను విడిచి పెట్టి ఆందోళన చేస్తున్నా ముఖ్యమంత్రికి తమపై కనికరం లేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి తమ డిమాండ్లు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 40వ రోజుకు చేరింది. దీక్షా శిబిరంలో ధర్నా చేసిన అనంతరం ర్యాలీగా పట్టణంలోని జ్యోతి బస్టాండు వరకు చేరుకుని బస్టాండు కూడలిలో అంగన్వాడీ కార్యకర్తలు రాస్తారోకో చేశారు. అక్కడే మానవహారం నిర్మించారు. మదనపల్లెలో శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టరేట్ వరకు అంగన్వాడీలు ర్యాలీగా వచ్చి సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అంగన్వాడీల కోర్కెలు తీర్చాలని, ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెను చులకనగా చూస్తున్న ప్రభుత్వానికి తమ సత్తా తెలిపేందుకు నిరవధిక సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వైఎస్ షర్మిలకు ఘన స్వాగతం

• ప్రత్యేక విమానంలో కడపకు చేరుకున్న షర్మిల, రఘువీర, కేవీపీ
• మాజీ మంత్రి అహ్మదుల్లా కాంగ్రెస్‌లో చేరిక



వైఎస్ షర్మిలకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

కడప(కలెక్టరేట్) /వేంపల్లె, జనవరి 20: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కడప విమానాశ్రయంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఘన సాగ్వతం పలికారు. శనివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, మాజీ మంత్రి రఘువీరారెడ్డితో కలసి కడప విమానాశ్రయానికి చేరుకున్న షర్మిలకు పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాముల ఆధ్వర్యంలో గజమాల వేసి స్వాగతం పలికారు. షర్మిలకు మద్దతు తెలిపేందుకు దాదాపు 200 వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డిలు కడప నగరంతో పాటు విమానాశ్రయం వరకు కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్మిక విభాగం అధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్, ఎన్ఎస్‌యూఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తునవాహనాల్లో పెండ్లిమర్రి మండలం మీదుగా వేంపల్లెకు బయలుదేరారు. అక్కడ కూడా బాణాసంచా కాల్చి భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి ఇడుపులపాయ ఎస్టేట్‌కు చేరుకున్నారు. వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళి అర్పించిన అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, పీసీసీ ఉపాధ్యక్షులు బండి జకరయ్య, నజీర్ అహమ్మద్, నేతలు ఎస్ఏ సత్తార్, చీకటి చార్లెస్, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, అనంతపురం, అన్నమయ్య, నంద్యాల జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్‌లో మాజీ మంత్రి అహ్మదుల్లాకు షర్మిల కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల కోసం వైఎస్ ఆశయాల సాధనకోసం షర్మిల వెంట నడుస్తామని అహ్మదుల్లా తెలిపారు.




షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి అహ్మదుల్లా

కర్బూజ రైతు కంట కన్నీరు

• భారీగా తగ్గుతున్న ధరలు • నిన్న కిలో రూ.19.. నేడు రూ.7 నుంచి రూ.10



ములకలచెరువు, జనవరి 20: కర్బూజ కాయల ధరలు రైతులకు కన్నీరు తెప్పిస్తున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకుని ఆరు గాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతన్నలకు చివరకు నిరాశే మిగులుతోంది. ధరలు భారీగా తగ్గుతుండడంతో పెట్టుబడులు సైతం చేతికందుతాయో లేదోనని అన్నదాతలు దిక్కులోచని స్థితిలో పడ్డారు. రోజు రోజుకు కర్బూజ కాయల ధరలు తగ్గిపోతుండడంతో రైతులు కుమిలిపోతున్నారు. నిన్నటి వరకు కిలో రూ.19 పలికిన ధర క్రమంగా తగ్గుతూ రూ.7 నుంచి రూ.10 వరకు చేరాయి. ధరలు మరింత తగ్గే అవకాశం ఉండడంతో సీజన్ ప్రారంభంలోనే ధరలు కలవరపెడుతున్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల్లో 500 ఎకరాలకుపైగా కర్బూజ పంట సాగు చేశారు. సాగు మరింత పెరిగి వెయ్యి ఎకరాలకుపైగా చేరవచ్చు. ఎకరా సాగుకు రూ.90 వేల నుంచి రూ.1.10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. రెండు నెలల క్రితం సాగు చేసిన పంట ప్రస్తుతం దిగుబడి వస్తోంది. వ్యాపారులు రైతుల తోటల వద్దకే వచ్చి కాయలు కొనుగోలు చేసి బయటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ పండించిన కాయలను తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని గుంటూరు, విజయవాడ తదితర పట్టణాలకు రవాణా చేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలో కూడా పంట సాగు ఎక్కువగా ఉండడంతో అక్కడ దిగుబడి రావడం ప్రారంభమైంది. దీంతో కేరళ, కర్ణాటక రాష్ట్రాలు తమిళనాడు రాష్ట్రం నుంచే దిగుమతి చేసుకుంటున్నాయి. కేరళ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో తమిళనాడు రాష్ట్రం ఉండడంతో రవాణా సులువుగా ఉంది. ఈ కారణంగా మన ప్రాంతంలో పండిన కర్బూజకు డిమాండ్ భారీగా తగ్గిపోవడంతో క్రమంగా ధరలు పడిపోతున్నాయి. తమిళనాడు రాష్ట్రంలో పూర్తి స్థాయిలో దిగుబడి వస్తే ఇక్కడి ధరలపై మరింత ప్రభావం పడనుంది.



ముంచిన అకాల వర్షం

కర్బూజ రైతులను అకాల వర్షం ముంచింది. గత నెలలో కురిసిన అకాల వర్షం కారణంగా తోటలు వైరస్ బారిన పడ్డాయి. వైరస్ కారణంగా ఆకులు మాడిపోయాయి. దీంతో కాయలు సైజు రావడం తగ్గిపోయాయి. సైజు లేని కాయలు కిలో రూ.5 నుంచి రూ.6కు అడుగుతున్నారు. ఇలా అయితే సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు లేక రైతు కంట నీరు వస్తోంది.

పెట్టుబడి రావడం కూడా కష్టమే..



రెండు ఎకరాల్లో కర్బూజ పంట సాగు చేశా. దీనికి రూ.2 లక్షల వరకు ఖర్చు వచ్చింది. కాయలు పెరిగే సమయంలో గత నెలలో అకాల వర్షం కురవడంతో చెట్లకు వైరస్ సోకి ఆకులు నల్లగా మాడిపోయాయి. ఈ కారణంగా కాయలు సైజు రాలేదు. కాయలు సైజు లేవని వ్యాపారులు కిలో రూ.6తో అడుగుతున్నారు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. పంట సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

- ఆంజనేయులు, రైతు, చెట్లవారిపల్లె

కర్బూజ ధర మరింత తగ్గే అవకాశం..



కర్బూజ ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. తమిళనాడులో పంట దిగుబడి ప్రారంభం కావడంతో ఇక్కడి కాయలకు డిమాండ్ తగ్గుతోంది. ఇక్కడి నుంచి కాయలను తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నాము. తమిళనాడులో కాయలు ప్రారంభం కావడంతో పక్కనున్న కేరళ, కర్ణాటక రాష్ట్రాలు అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. తమిళనాడులో పూర్తి స్థాయిలో దిగుబడి వస్తే మన కాయలకు డిమాండ్ భారీగా తగ్గిపోతుంది.

- సయ్యద్‌బాషా, వ్యాపారి, ములకలచెరువు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతి చెందిన మహిళ

పెండ్లిమర్రి, జనవరి 20: కడప-పులివెందుల ప్రధాన రహదారిపై పెండ్లిమర్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం రాత్రి మేకల పార్వతి (42) అనే మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... కోరవాండ్లపల్లె బీసీ కాలనీకి చెందిన పార్వతి కూలి పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా కడప వైపునకు చామంతిపూల లోడుతో వెళ్తున్న క్యాంపర్ ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

నీటిగుంతలో పడి బాలుడు మృతి

వేంపల్లె, జనవరి 20: మండలంలోని పాపాఘ్ని నది గండి బ్రిడ్జి వద్ద నీరున్న ఇసుక గుంతలో పడి పది సంవత్సరాల బాలుడు మృతి చెందాడు. ఆడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు తెలిసింది. ఆర్కేవ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఇడుపులపాయ ఎస్సీ కాలనీకి చెందిన బాలుడు అని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- రూ.20 లక్షల ఆస్తినష్టం


మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కడప (క్రైం), జనవరి 20 : నగరంలోని తాజ్‌నగర్ బజాజ్ షోరూం వద్ద గల షేక్ మహ్మద్ జావేద్ టింకరింగ్ షెడ్డు, వెల్డింగ్ షాపులో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో టింకరింగ్ షాపుతో పాటు అక్కడ ఉన్న రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారి బస్విరెడ్డి తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.20 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు షాపు యజమానులు తెలిపారు. తమకు జీవనాధారం ఆ షాపులేనని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హోటల్‌లో విజిలెన్స్ తనిఖీలు


సీజ్ చేసిన సిలిండర్లతో అధికారులు

కడప (క్రైం), జనవరి 20 : సిద్దవటం మండలం మాధవరం గ్రామంలోని ఓ హోటల్‌ను కడప విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీ నిర్వహించారు. కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫీసర్ షేక్ మాసుం బాషా ఆదేశాల మేరకు ఆ హోటల్‌ను తనిఖీ చేయగా గృహావసరాలకు ఉపయోగించే 4 ఇండేన్, ఒక హెచ్‌పీ సిలిండర్లు మొత్తం ఐదు సిలిండర్లను హోటల్‌లో వాడుతున్నట్లు గుర్తించారు. ఆ మేరకు ఆ సిలిండర్లను సీజ్ చేసి సిద్దవటంలోని షిర్డీ సాయి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. మాధవరానికి చెందిన హోటల్ యజమాని ఎ.మల్లిఖార్జునపై కేసు నమోదు చేశారు. హోటల్ యజమానులందరూ వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడరాదని, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను వాడాలన్నారు. లేదంటే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఈదురుబాషా, రెడ్డెప్ప, బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ సౌజన్య, హెడ్‌కానిస్టేబుల్ క్రిష్ణానాయక్ పాల్గొన్నారు.

ముచ్చుమర్రి వద్ద రూ.8.50 లక్షలు సీజ్


సీజ్ చేసిన నగదుతో ట్రైనీ డీఎస్పీ ఎస్ఐ

కొండాపురం, జనవరి 20 : మండలంలోని ముచ్చుమర్రి పునరావాస కేంద్రం వద్ద శనివారం సాయంత్రం పోలీసులు రూ.8.50 లక్షల నగదు సీజ్ చేశారు. ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, కొండాపురం ఎస్ఐ యోగీంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ నగదును స్వాధీనపరచుకున్నారు. అనంత పురం నుంచి ఎర్రగుంట్లకు కారులో వెళుతుండగా సాయిగణేశ్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎర్రగుంట్ల మండలం పెద్దనపాడుకు చెందిన సాయిగణేశ్‌రెడ్డి సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

కడపలో రూ.5 లక్షలు....

కడప (క్రైం), జనవరి 20 : కడప నగరం రెండో గాంధీ బొమ్మ వద్ద టూటౌన్ సీఐ తబరేజ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. కడప బిస్మిల్లానగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ అనే వ్యక్తి ఎలాంటి బిల్లులు లేకుండా రూ.5 లక్షలు నగదు స్కూటీలో తీసుకెళుతుండగా ఆ నగదును పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన నగదును ఐటీ శాఖకు అప్పగించామని సీఐ తెలిపారు.


మట్టి రాళ్లతో చదును చేసిన మాన్యం భూమి


జేసీబీతో చదును చేస్తున్న మాన్యం భూమి


చెన్నకేశవాలయం గాలిగోపురం

ఆలయ భూములు.. ఆక్రమణ యత్నం

- దొరసానిపల్లె భూములలో పార్కు నిర్మాణానికి ఎమ్మెల్యే యత్నం
- చెన్నకేశవ ఆలయానికి ఆస్తులున్నా.. ఆదాయం నిల్
- లీజుకివ్వని సాగు భూములు
- పదిహేడేళ్లుగా బీడుపడ్డ వైనం
- పట్టించుకోని దేవదాయ శాఖ

ప్రొద్దుటూరు, జనవరి 20: దసరా ఉత్సవాలు జరపడంలో దేశంలోనే రెండవ మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో ఆలయాల అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఆలయాల భూములను సకాలంలో లీజులకు ఇవ్వకపోగా.. ఆలయ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు అడ్డుకున్న దాఖలాలు లేవు. ప్రొద్దుటూరు పట్టణం నడిబొడ్డున పాతమార్కెట్‌లో పురాతన చెన్నకేశవాలయం ఆలనాపాలనా లేక అధ్వాన్న స్థితిలో ఉంది. ఈ ఆలయం గాలిగోపురం ముందు, ఆలయం ప్రాగణంలో కనీసం బండపరుపు సైతం సక్రమంగా లేదు.

అంతేకాకండా ఆలయంలో పురాతన మంటపం శిధిలావస్థకు చేరుకుంది. ఈ పురాతన మంటపంలో ఒకప్పుడు వివాహాలు, ఉత్సవాలు జరిగేవి. ఆలయప్రాగంణం అంతా ఎత్తు చేయడంతో గర్భగుడి తగ్గులో ఉంది. ఈ ఆలయాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో నేడు కసువు ఊడ్చే సిబ్బందికి, ఆలయ పూజారులకు సైతం జీతాలు చెల్లించలేని స్థితికి చేరుకుంది.

విలువైన భూములున్నా...

చెన్నకేశవాలయానికి ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామంలోని సర్వేనెంబరు 152 బీలో 10.06 ఎకరాలుంది. దొరసానిపల్లె సర్వేనెంబరు 40/3లో 3.97 ఎకరాలు, చౌటపల్లె వద్ద బొల్లవరం పొలం సర్వేనెంబరు 429లో 3.07 ఎకరాలు ఉన్నాయి. చాపాడు మండలం మడూరు గ్రామంలో సర్వేనెంబరు 192-బీ2లో 1.02 ఎకరాలు, సర్వేనెం 194లో 9.87 ఎకరాలు ఉన్నాయి. గోపవరం, మడూరు భూములద్వారా మాత్రమే ఏడాదికి రూ.80 వేలు లీజు వస్తుంది. ఆలయం చుట్టూ ఉన్న 12 అద్దెగదులకు నెలకు రూ.42 వేలు అద్దె వస్తున్నట్లు ఆలయ అధికారులు తెలుపుతున్నారు. అద్దెగదుల ఆదాయం, దసరా, వైకుంఠ ఏకాదశినాడు వచ్చే హుండీ ఆదాయం తప్ప ఈ ఆలయానికి ఆదాయం లేదు.

నాలుగు ఎకరాలు చదును చేసిన ఎమ్మెల్యే

గోపవరం, చౌటపల్లె, దొరసానిపల్లెలోని ఆలయ భూములు కోట్ల రూపాయల విలువ చేస్తాయి. చౌటపల్లె, దొరసానిపల్లె వద్ద ఉన్న ఆలయ భూములను పదిహేడేళ్లుగా లీజుకు ఇవ్వక బీడు పడిపోయాయి. కాగా.. దొరసానిపల్లె సర్వేనెంబరు 40/3లో ఉన్న 3.97 ఎకరాల ఆలయ భూమి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఇంటిముందు ఉంది. గతంలో ఇందులో వ్యవసాయం చేసేశారు. దీనిని లీజుకు ఇవ్వకుండా కొందరు రాజకీయ నాయకులు అడ్డుకుంటున్నట్లు సమాచారం. ఈ భూమి ఎదురుగా ఎమ్మెల్యే నివాసం ఉండటంతో దానిని దొరసానిపల్లె పంచాయతీకి లీజుకు ఇచ్చేలా, అక్కడ పార్కు నిర్మించాలని దేవదాయ శాఖకు ఉత్తరాలు రాశారు. తమ భూమిని పంచాయతీకి లీజుకు ఇచ్చే విషయంలో దేవదాయ శాఖ ఏ నిర్ణయం తీసుకోలేదు. అయినా.. ఆ భూమిలో పెద్ద ఎత్తున మట్టి వ్యర్థాలు తోలి చదును చేసే పనులను అనధికారికంగా ఎమ్మెల్యే చేపట్టారు. ఇప్పుడు ఆ భూమి లీజుకు ఇవ్వాలన్నా వ్యవసాయ సాగుకు అనుకూలంగా లేకుండా పోయింది. నాలుగెకరాల దేవుని మాన్యంలో పార్కు నిర్మించి తన ఇంటి ముందు ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే తలచారు. ఆ మేరకు దేవదాయ శాఖ అధికారులు స్పందించకపోయినా.. ఎమ్మెల్యే ఆ భూమిని చదును చేసి తన ఇంటి ముందు భారీ పార్కింగ్ ఏర్పాటు చేసుకున్నారు.

లీజుకు ఇవ్వడానికి పంచాయతీకి అనుమతులు లేవు..

దొరసానిపల్లె పంచాయతీకి పార్కు నిర్మాణం కోసం లీజుకు ఇవ్వడానికి దేవదాయ శాఖ అనుమతులు ఇవ్వలేదు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి రెండేళ్లక్రితం దేవదాయ శాఖకు లెటర్‌పెట్టారు. ఆ భూమిలో కంపచెట్లు మొలిచి అశుభ్రంగా ఉంటే దానిని ఎమ్మెల్యే శుభ్రం చేసి మట్టి వ్యర్థాలు తోలి చదును చేశారు. చదును చేయడానికి దేవదాయ శాఖ అనుమతులు ఇవ్వలేదు.

- జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ ఈవో ప్రొద్దుటూరు


ఎమ్మెల్యే ఇంటిముందు పార్కుగా మార్చాలనుకున్న మాన్యం భూమి


శిథిలావస్థకు చేరిన దేవాలయంలోని ఉత్సవ మంటపం

లోక్ అదాలత్‌తో సత్వర సేవలు

జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్



మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 20 : సేవా రంగాల్లో లోపాలకు సత్వర న్యాయం లోక్‌అదాలత్ ద్వారా పొందవచ్చని జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ చైర్మన్ స్వర్ణప్రసాద్ తెలిపారు. శనివారం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా శాశ్వత లోక్ అదాలత్ ప్రజాప్రయోజిత న్యాయ సేవా అవగాహన కార్యక్రమం వైవీయూలో నిర్వహించారు. వైవీయూ లీగల్ సెల్ నోడల్ అధికారి ఆర్‌వీ జయంత్ కశ్యప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి అధ్యక్షత వహించారు.

చైర్మన్ స్వర్ణప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ద్వారా ప్రతి పౌరుడు న్యాయం పొందే హక్కు కల్పించిందన్నారు. అందులో భాగంగా అవసరమైన ప్రజలకు సత్వర న్యాయాన్ని అందించేందుకు శాశ్వత లోక్ అదాలత్ పనిచేస్తుందన్నారు. ఇక్కడ లభించే తీర్పు సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో సమానమని, తీర్పు వెలువడ్డాక హైకోర్టుకు అప్పీలు అనేది ఉండదని స్పష్టం చేశారు. కోటి విలువ గల వివాదాలు ఇక్కడ ప్రజా ప్రయోజిత సేవా రంగాలకు సంబంధించి రవాణా సమాచార, విద్యుత్, నీటిసరఫరా గ్రామ పంచాయతీ మున్సిపాలిటీ, ప్రజాసేవలు ప్రజారోగ్యం బీమా సౌకర్యాలు, విద్యా సంస్థలు, స్థిరాస్తి వ్యాపారం, ఉపాధి హామీ, బ్యాంకుల సేవా లోపాలు ఎదురైనప్పుడు పర్మనెంటు లోక్ అదాలత్ సత్వర సేవలు పొందవచ్చన్నారు. 90 రోజుల్లోపు బాధితులకు సాంత్వన కల్పిస్తామని, గతంలో వెలువడిన తీర్పులను ఉదహరిస్తూ అవగాహన కల్పించారు.

వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ మాట్లాడుతూ న్యాయపర సమస్యల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అన్నారు. అనంతరం న్యాయపరమైన సందేహాలను చైర్మన్ దృష్టికి తేగా న్యాయపరంగా సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో వైవీయూ రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు డ్రైవర్ల మధ్య ఘర్షణ

రాయచోటి టౌన్, జనవరి 20 : రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఆర్టీసీ బస్సు, కారు డ్రైవర్ల మధ్య జరిగిన ఘర్షణపై శనివారం రాయచోటి అర్బన్ పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు...కడప నుంచి బెంగళూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో బస్సును రోడ్డుకు అడ్డంగా పెట్టాడని కారు డ్రైవర్ మందా గణేశ్ ఆగ్రహంతో బస్సు అద్దాలను పగలగొట్టి తనపై దాడి చేశాడని బస్సు డ్రైవర్ ఫిర్యాదు చేశారన్నారు. అలాగే బస్సును రోడ్డుకు అడ్డంగా పెట్టడమే కాకుండా తనపై దాడి చేశారని కారు డ్రైవర్ ఫిర్యాదు చేశాడన్నారు. ఇరువురు డ్రైవర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ప్రపంచబ్యాంకు ప్రతినిధుల విచారణ

ప్రొద్దుటూరు, జనవరి 20 : గ్రామాల్లోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో జరుగుతున్న కుటుంబ వైద్యుల కార్యక్రమంతో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ప్రపంచ బాంకు ప్రతినిధులు డాక్టర్ రజత్, డాక్టర్ ఇర్ఫాన్ గ్రామాల్లో ప్రజలను విచారించారు. శనివారం మండల పరిధిలోని కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని దొరసానిపల్లె కొత్తపల్లెలోని ఐదు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారికి వైద్యపరంగా ఇంకా ఎలాంటి సేవలు కావాలో వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కడప నుంచి డాక్టర్ ఆరీఫ్ కల్లూరు, కామనూరు వైద్య అధికారులు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్ సీహెచ్‌వోలు దివ్యలక్ష్మీ, రజియా, క్రిష్ణమ్మ, హెచ్ ఈవో రాజశేఖర్ సూపర్‌వైజర్స్ బీఏ వరప్రసాద్, చంద్రకళ, మాధవరెడ్డి, సీహెచ్‌వో గౌతమి, ప్రణీత, కళ్యాణి, ఆరోగ్య కార్యకర్తలు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

కలగానే 30 పడకల ఆసుపత్రి

- ఎన్నికల హామీలు మరిచిన ప్రజాప్రతినిధులు
- సరైన వైద్యం అందక ప్రజల ఇక్కట్లు

సుండుపల్లె, జనవరి 20: సుండుపల్లె మండలం ఓ మారుమూల ప్రాంతం. సుమారు లక్షకుపైగా జనాభా కలిగిన మండలంలో సరైన వైద్యం అందక నిరుపేద కుటుంబాలు వందలు, వేల రూపాయలు వెచ్చించి ప్రైవేటు వైద్యం పొందాల్సిన దయనీయ పరిస్థితి ఈ మండలంలో దాపురించింది. 14 గ్రామ పంచాయతీల్లో 261 పల్లెల నుంచి ప్రజలు నిరంతరం మండల కేంద్రానికి పలు రోగాలతో వచ్చే పరిస్థితి ఉన్నా ప్రభుత్వ వైద్యం రోగులకు అందని ద్రాక్షలా మారిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014లో ఎన్నికల అనంతరం మండలంలోని పలువురు మండల నాయకులతో కలిసి ప్రభుత్వ వైద్యశాలలో సమావేశాలు నిర్వహించిన ప్రతిసారీ ఓట్లు వేయించుకున్న ప్రజాప్రతినిధులు శాలువాలతో సన్మానాలు చేయించుకొని కేవలం ఓట్లు దండుకునేందుకు సుండుపల్లెలో నేడో రేపో 30 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేస్తామని గాలి మాటలు చెప్పడం తప్ప వారు హామీలు నెరవేర్చిన పాపాన పోలేదని ప్రజలు వాపోతున్నారు. మళ్లీ 2019 ఎన్నికల సమయంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలు 30 పడకల ఆసుపత్రిని తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పిన మాటలు నేటికీ నీటిపై రాతల్లానే మిగిలిపోయాయి. వేల మంది శ్రేయస్సు కోసం 30 పడకల ఆసుపత్రిగా ప్రస్తుతం ఉన్న వైద్యశాలను నిర్మించే హామీని మరిచిపోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శలు వస్తున్నాయి. ఆసుపత్రిలో కనీసం ప్రసవాలు జరిగినా కూడా తల్లిబిడ్డతో పాటు ఇతర రోగులు ఉండలేని దయనీయ పరిస్థితి సుండుపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఉంది. పాలకులు ఏనాడైనా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధిని పట్టించుకున్నారా మళ్లీ 2024 ఎన్నికలు వస్తున్నాయి. మళ్లీ వచ్చి అవే హామీలు గుప్పించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేయడం తప్ప ఇంకేమీ లేదని ప్రజలు బహిర్గతంగా మాట్లాడుకుంటున్నారు. 30 పడకల ఆసుపత్రి మంజూరై పూర్తయితే మారుమూల మండలంలోని నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సరైన వైద్యం అందక అనేకమంది ప్రాణాలు కోల్పోవాల్సిన దయనీయపరిస్థితి ఏర్పడింది. అత్యవసర సేవలు అవసరమైతే ఇక్కడి నుంచి కడప, తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లేలోపు రోగులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చాలానే ఉన్నాయి. గర్భిణులకు ప్రసవం చేయించాలన్నా కనీస వసతులు కూడా లేని దౌర్భాగ్య స్థితిలో ఇక్కడి ఆస్పత్రి ఉందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల నాటికైనా 30 పడకల ఆసుపత్రిగా సుండుపల్లె ప్రాథమిక వైద్య కేంద్రానికి శంకుస్థాపన చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సుండుపల్లె ప్రాథమిక వైద్యశాల


ఆసుపత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

30 పడకల ఆసుపత్రి నిర్మించాలి



స్థానిక వైద్యశాలలో రోగులకు సరైన వైద్యం అందడం లేదు. సరైన వసతులు కూడా లేవు. మండల నలుమూలల నుంచి రోగులు వస్తారు కానీ వైద్యశాలలో వైద్యులు ఉండరు. ఎప్పుడో ఉదయం 10 గంటల తర్వాత వస్తారు. మధ్యాహ్నం 2 గంటలకే వెళ్లిపోతున్నారు. అసలు రోగులు వైద్యశాలకు రావడమే మరిచిపోతున్నారు. 30 పడకల ఆసుపత్రి నిర్మిస్తే మండల ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతుంది.

- రమణయ్య, సుండుపల్లె



రైల్వేకోడూరు: రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నేతలు



రాయచోటి: అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



చిట్వేలి: రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



లక్కిరెడ్డిపల్లె: మూడు రోడ్ల కూడలిలో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

నమ్మి ఓటేసినందుకు.. నట్టేట ముంచాడు

● రాస్తారోకోలతో అంగన్‌వాడీల ఆగ్రహం

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 20: నమ్మి ఓట్లేసిన పాపానికి అంగన్వాడీలను రోడ్లపాలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్‌నాయక్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి ఎద్దేవా చేశారు. అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం బంగ్లా సర్కిల్ వద్ద కార్మిక సంఘాలు, రైతు, ఉపాధ్యాయ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను, కార్మికులను, ఉద్యోగ ఉపాధ్యాయులను నమ్మించి మోసం చేయడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిట్ట అన్నారు. అసెంబ్లీ సాక్షిగా చెప్పిన హామీలను అమలు చేయమంటే ఎస్మా చట్టం ప్రయోగించి, షోకాజ్ నోటీసులు జారీ చేసి బెదిరించడం దిగజారుడుతనం అన్నారు. 40 రోజులుగా అంగన్వాడీలు రాత్రి, పగలు ఆందోళన చేస్తుంటే కక్ష పూరితంగా వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. తక్షణమే వేతనం పెంచడంతోపాటు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు చంద్రశేఖర్ విమర్శించారు. అంగన్వాడీల ఉద్యమానికి సంఘీభావం గా శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల సీఐటీయూ ఉపాధ్యక్షుడు లింగాల యానాదయ్య, కోశాధికారి హరినారాయణ, ఏపీఎండీసీ, జేఏసీ పోరాట కన్వీనర్ ఆర్. వెంకటేష్, మంగంపేట మైనింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పుల గంటి శ్రీనివాసులు, నాయకులు హరి, సుబ్రహ్మణ్యం, బొజ్జా శివయ్య, కేశవులు, నాగిపోగు పెంచలయ్య, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధా కుమారి, నాయకురాళ్లు దుర్గా, కుమారి, వెన్నెల, వాణి, సుజాత, ఈశ్వరమ్మ, స్వర్ణ, రోజా, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని. సీపీఎం కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు శనివారం వారు సంఘీభావం తెలిపారు. గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి అంగన్‌వాడీలు ఆమరణ నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నియంత ధోరణిలో వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు యదరూరి సుజాత పగడాల సుధామణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పందికాళ్ల మణి, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, సీపీఐ మండల కార్యదర్శి కేశం ప్రసాద్ ఆటో యూనియన్ నాని, సిద్ధు, నారాయణ, మల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: అంగన్ వాడీల సమస్యలు పరిస్కారం అయ్యేంత వరకు ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీపీఐ నాయకుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఐసీడీఎస్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ, అనంతరం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ లో ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటాయని దుయ్యబట్టారు. రెండు నెలలుగా అంగన్‌వాడీలు తమ గోడును చెబుదామనుకుంటే వినేవారు లేరన్నారు. అంగన్‌వాడీల సమ స్యలు పరిష్కారమయ్యేంత వరకు ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, ప్రధాన కార్యదర్శి ప్రభావతి,తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : స్థానిక బైపాసులోని ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.రాయుడు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సికిందర్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈశ్వరమ్మ, అమరావతి, జ్యోత్స్న, విజయ, శివరంజిని, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కాటంశెట్టి వెంకటయ్య, పి.సుబ్రమణ్యం, గాలి చంద్ర మౌలా, సుబ్రమణ్యం, కోటి, చంద్ర, మణి, నాగేంద్ర, మున్నా పాల్గొన్నారు.

సుండుపల్లె ఎస్ఐగా చెన్నకేశవులు

సుండుపల్లె, జనవరి 20: సుండుపల్లె ఎస్ఐగా చెన్నకేశవులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా ఎస్ఐ బదిలీలలో భాగంగా ఆయన సుండుపల్లెలో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు తనను కలవవచ్చునని తెలిపారు. సుండుపల్లెలో పనిచేసిన రామకృష్ణారెడ్డి రాయచోటికి బదిలీ అయ్యారు.

జనసేన జోనల్ కమిటీ కన్వీనర్‌గా జోగినేని మణి



జోగినేని మణి



వెంకటేష్

రైల్వేకోడూరు, జనవరి 20: జనసేన జోన్ కమిటీ కన్వీనర్‌గా జోగినేని మణి, కో-కన్వీనర్‌గా పగడాల వెంకటేష్‌ను నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యర్థి ఎవరైనా గెలుపు కోసం కష్టపడతా మని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామ న్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడ తామని, ఆ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీకి భారీ మూల్యం : కస్తూరి

రైల్వేకోడూరు, జనవరి 20: వచ్చే ఎన్నికల్లో వైసీపీ భారీ మూల్యం చెల్లించక తప్పదని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. శనివారం రైల్వేకోడూరు మండలంలోని గంగరాజుపోడు, రాఘవరాజపురం, మైసూరివారిపల్లెల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోవు కార్యక్రమాలను ప్రజలకు ముందుగానే వివరిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మా శివ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, నాయిడోరి రమణ, కారుమంచి సంయుక్త, శివయ్య, తేనేపల్లి చిన్నా, ఆకేపాటి సుకుమార్‌రెడ్డి, ముక్కర శంకరయ్య జనసేన నేత పగడాల వెంకటేష్, వరికూటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మైసూరివారిపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పత్రాన్ని ఇస్తున్న కస్తూరి తదితరులు

ఓబులవారిపల్లె : మండలంలోని గొబ్బూరువారిపల్లెలో మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, మాజీ జెడ్పీటీసీ నాయుడోరి రమణ, కాకర్ల రెడ్డయ్యానాయుడు, ఈడిగపల్లి శివయ్యనాయుడు, దుద్యాల జయచంద్ర, మహిళా నాయకురాలు అనితదీప్తి తదితరులు పాల్గొన్నారు.

‘రాజంపేటలో టీడీపీ గెలుపునకు కృషి చేస్తాం’

ఒంటిమిట్ట, జనవరి 20 : రాజంపేట నియోజకవర్గంలో విజయానికి కృషి చేస్తామని పసుపులేటి పవన్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక హరిత హోటల్‌లో పసుపులేటి నరసమ్మ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు, సీనియర్ టీడీపీ నాయకులు, కార్య కర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గానికి మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య చేసిన అభివృద్ధి ఇప్పటికీ గ్రామీణ ప్రాంతా ల్లో కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్తపల్లి శ్రీనివాసు లు, కొమరా వెంకటనరసయ్య, అడ్వకేటు రాందాసు, ఎస్.వి.రమణ, అంగడాల వెంకట సుబ్బయ్య, బొబ్బిలిరాయుడు, చింతగింజల సుబ్రమణ్యం మామిళ్ల శ్రీహరి, డాక్టర్ శివకుమార్, పత్తి సుబ్బరాయుడు, పలువురు సీనియర్ నాయ కులు పాల్గొన్నారు.



బ్రహ్మయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

టీడీపీ విజయంతో బీసీలకు రక్షణ చట్టం

నందలూరు, జనవరి20 : భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా దేశంలోనే మొదటిసారిగా బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్ని విధాలా అండగా నిలవాలని తెలుగుదేశం పార్టీ నిశ్చయించుకుందని టీడీపీ బీసీ సెల్ పార్లమెంటు అధ్యక్షుడు పిల్లింగిరి సురేంద్ర యాదవ్ తెలిపారు. శుక్రవారం నందలూరులో మండల పార్టీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ప్రతి కార్యకర్త టీడీపీ విజయదానికి పాటుపడాలని కోరారు. బీసీలకు జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారని స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి 16,800 రాజ్యాంగబద్ధ పదవుల్ని రద్దు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు పసుపులేటి ప్రవీణ్, గొబ్బిళ్ల సుబ్బరాయుడు, నాగరాజు యాదవ్, అలగాని రెడ్డప్ప, జనార్ధన్ గౌడ్, జ్ఞానమూర్తి, ముంబాయి, దుర్గాప్రసాద్, శివప్రసాద్ నాయుడు, చామంచి పెంచలయ్య, కాంట్రాక్టర్ వెంకట సుబ్బయ్య, ముమ్మడిశెట్టి రమేష్, టీఎన్ఎస్ఎఫ్ వేణు, షర్మిల, గౌస్‌బేగ్, మాబాష, అమీర్ ఖాన్, కానకుర్తి వెంకటయ్య, మనీ, పెద్ద ఎత్తున మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జయహో బీసీ గర్జన కార్యక్రమంలో బీసీ నేతలు

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

ఒంటిమిట్ట, జనవరి 20 : రాజంపేట టీడీపీ నాయ కులు మేడా విజయశేఖర్ రెడ్డి జన్మదినం సంద ర్భంగా మండలంలోని కొత్త మాధవరంలోని కా శినాయన అనాథ వృద్ధాశ్రమంలో శనివారం మండలంలోని టీడీ పీ నాయకులు, కార్యకర్తలు శనివారం పండ్లు పంపిణీ చేశారు. చింతగింజల సుబ్రమణ్యం, బాలకృష్ణయ్య, చేపూరి బాలాంజనేయులు, పలుకూరి దత్తాత్రేయులు, వినోద్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ఓబులవారిపల్లె, జనవరి 20: మండలంలోని వై.కోట, ఓబుల వారి పల్లె ప్రభుత్వ ఆసుపత్రులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కొండయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి దేవేందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా జవహర్ నవోదయ పరీక్షలు

లక్కిరెడ్డిపల్లె జనవరి 20: స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలో శనివారం జవహర్ నవోదయ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 270 మంది దరఖాస్తు చేసుకోగా 169 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరులు తెలిపారు.

నేత్ర పరీక్షలు

ఓబులవారిపల్లె, జనవరి20 : ముక్కావారిపల్లె టీటీడీ కల్యాణ మండపంలో గత నెలలో కంటి ఆపరేషన్లు చేయించుకున్నవారికి శంకర నేత్రాలయ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. జనవరి 29న వారికి కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు మల్లు ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రేపు శోభాయాత్ర

రైల్వేకోడూరు, జనవరి 20: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అంకమ్మనగర్‌లోని జాంబవంతస్వామి ఆలయం నుంచి 22న శోభాయాత్ర నిర్వహిస్తు న్నట్లు నిర్వాహకులు తెలిపారు. వెయ్యి మందితో శ్రీరామ దీపా లంకరణ, స్వామి ఊరేగింపు, మహిళలతో కోలాటాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు.

కబ్జాదారుల కొమ్ముకాస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి



ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గాలివీడు, జనవరి20: ప్రభుత్వ భూముల కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం గాలివీడులో పర్యటించిన ఆయన ఆక్రమణకు గురైన హౌసిం గ్ కార్యాలయం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల స్థలాలను ఆక్రమించుకునేలా ప్రేరేపిస్తున్న రెవెన్యూ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులకు అందాల్సిన పొజిషన్ సర్టిఫికెట్లకు ఒక్కోదానికి లక్ష రూపాయల చొప్పున ధర నిర్ణయించి విక్రయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన పొజిషన్ సర్టిఫికెట్లపై సమగ్ర విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు పుల్లయ్య, కృష్ణమూర్తి, హరి, ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్, గణేశ్ పాల్గొన్నారు.

నేడు లూయీ బ్రెయిలీ జయంతి

రాయచోటిటౌన్, జనవరి 20: లూయీ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు జాతీయ అంధుల సమాఖ్య అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి వెంకట నాగేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అంధులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు పూటలా భోజనంతో పాటు ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని అంధులంతా సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం 7396576847, 9440521108 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

టీడీపీలో చేరిక





సుగవాసి సోదరుల ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన గాలివీడు మండల వాసులు

రాయచోటిటౌన్, జనవరి 20: రాజంపేట పార్లమెంట్ టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు సమక్షంలో శనివారం గాలివీడు మండలం శెట్టివారిపల్లెలోని చెన్నూరు, కోలా కుటుంబాలకు చెందిన యువకులు టీడీపీ కండువా కప్పుకున్నారు రాయచోటిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చెన్నూరు రమణయ్య, చెన్నూరు రామాంజులు, చెన్నూరు శివరాం, చెన్నూరు రెడ్డెప్ప, కోలా రమణ, కోలా సాయి కుటుంబాల యువకులు గాలివీడు తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ రియాజ్, ఆనంద్ బాబుఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, రామాంజులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

గాలివీడు, జనవరి 20: మండలంలో కులగణన సర్వే పకడ్బందీగా నిర్వ హించాలని అన్నమయ్య జిల్లా చీఫ్ ప్లానింగ్ (సీపీవో) కృష్ణానాయక్ తెలిపారు. శనివారం గాలివీడు-2 గ్రామ సచివా లయం పరిధిలోని చిలకలూరి పేటలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చేస్తున్న కులగణన సర్వేను ఆయన పరిశీలించారు. డేటా ఎంట్రీ సమయంలో తీసుకుంటున్న చర్యల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జనవరి 28 కల్లా కులగణన సర్వే క్షేత్రస్థాయిలో పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి, ఏవో జాబీర్ అహమ్మద్, పంచాయతీ కార్యదర్శి రాధికారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

విటమిన్ల లోపంతోనే ఆవుల మృతి



పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యులు

రామాపురం, జనవరి 20: మండలంలోని రాచపల్లెలో అంతు తెలియని వ్యాధితో ఆవులు మృతి చెందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం వైద్యబృందం గ్రామంలో పర్యటించి చనిపోయిన ఆవుకు పోస్టుమార్టం నిర్వహించారు. ఆవుల మృతికి క్యాల్షియం, పాస్ఫరస్ లోపమే కారణంగా గుర్తించారు. ఆవు శరీరం నుంచి నమూనాలను సేకరించి విజయవాడలోని రాష్ట్ర పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలకు పంపనున్నట్లు తెలిపారు. మరిన్ని పశువుల రక్తనమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉప సంచాలకులు మాలకొండయ్య, లక్కిరెడ్డిపల్లె ఏడీ బెనర్జీ, జిల్లా పశు వ్యాధి నిర్ధారణ బృందం రాంబాబు, రామాపురం మండల పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి, అంజనేయులు, పశువుల యజమానులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



బహుమతి ప్రదానం చేస్తున్న జనసేన సమన్వయకర్త అతికారి దినేశ్

సుండుపల్లె, జనవరి 20: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జనసేన రాజంపేట నియోజకవర్గ సమన్వయకర్త అతికారి దినేశ్ తెలిపారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్ విజేత రాయవరం జట్టుకు రూ.30 వేలు, చిన్నగొల్లపల్లె జట్టుకు రూ.15 వేలుబహుమతులను అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను రాయవరం జట్టు క్రీడాకారుడు అఫ్రోజ్ గెలుచుకున్నారు గుగ్గిళ్ల నాగార్జున, ఓబులేసు, సుధారాణి, గణపతి, విజయభాస్కర్, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంతో బతుకులు మారవు



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ, జనసేన నేతలు

సుండుపల్లె, జనవరి 20: అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల బతుకులు మారవని టీడీపీ, జనసేన, ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలేల విగ్రహాలకు వినతి పత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం ఏర్పాటు చేయడానికి స్వాగతిస్తున్నాం కానీ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నిధులను మాయం చేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను గ్రామాల్లో అభివృద్ధికి వినియోగించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతీ, యువకులకు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి శివకుమార్‌నాయుడు, పార్లమెంట్ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి దామోధర్‌నాయుడు, జనసేన నాయకులు రామశ్రీనివాస్, ఎంఆర్‌పీఎస్ నాయకులు నాగలేసు, బీసీ నాయకులు రమణ, చిన్నకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు చెన్నంశెట్టి వెంకట్రమణ, ఎర్రంరెడ్డి, దళిత నాయకులు వీరనాగయ్య, మహదేవ, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ‘జనంలోకి జనసేన’



జనంలోకి జనసేన కార్యక్రమంలో కార్యకర్తలు

నందలూరు, జనవరి 20 : జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ నాయకులు శనివారం ఈదరపల్లె, విజయసాగర్ గ్రామాల్లో పర్యటించి పవన్‌కల్యాణ్ ఆశయాలను, జనసేన పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. యల్లటూరు శ్రీనివాసరాజు మనందరి మద్దతుతో ప్రజా సమస్యలకు, ఉపాధికి పరిష్కారం చూపుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు ఆకుల చలపతి, భారతాల ప్రశాంత్, సాయి, శ్రీనివాస్, తిప్పాయపల్లె ప్రశాంత్, అబ్బిగారి గోపాల్, మంటి సుబ్బు, వెలకచర్ల హరిబాబు, పోకూరి మల్లికార్జున, పైడికొండ్ల సునీల్, మహేష్, కివిటి సాయి, వినయ్, నందు, కరీముల్లా, బాలాజీ, పోకూరి మనోహర్, అల్లిశెట్టి కిరీటి, నరేంద్ర, హరి, అమర్, చందు, కళ్యాణ్, సాయి, మొహమ్మద్, వాహబ్, కరీముల్లా, వర్ణ కార్తీక్, శ్రీకాంత్, మహి, హరికృష్ణ పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణతో మంచి దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె జనవరి 20: మామిడిలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చునని ఉద్యాన శాఖ అధికారి నాగమణి తెలిపారు. శనివారం మండలంలోని మద్దిరేవుల, కస్తూరిరాజుగారి పల్లెలో మామిడి రైతులకు శిక్షణ ఇచ్చారు..

వేరుశనగకు అడవి పందుల బెడద

వీరబల్లి, జనవరి 20: మండలంలో వేరుశనగ పంటకు అడవి పందుల బెడద అధికమైంది. కావలి ఉంటున్నా గుంపులు గుంపులుగా వచ్చి పంటను నాశనం చేస్తున్నాయని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా మాదిరెడ్డిగారిపల్లె సమీపంలో సాగు చేసిన వేరుశనగ పైరును పూర్తిగా ధ్వంసం చేశాయని వెంకట్రామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని తగు నష్టపరిహారం అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

వీరబల్లి, జనవరి20: మండల పరిధిలోని వంగిమళ్ల పంచాయతీ ఉప్పరపల్లె సమీపంలో జూదమాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి జూదరులను అదుపులోకి తీసుకొని రూ.5200 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండుకు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రాజంపేట, జనవరి20 : జోనల్ స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో తమ విద్యార్థులుప్రతిభ కనబరిచినట్లు రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ వెల్లడించారు. ఈ నెల 19న విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మోహన్ బాబు యూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో కబడ్డీలో సిల్వర్, వాలీబాల్‌లో కాంస్య పతకాలు సాధించారన్నారు. ఫిబ్రవరిలో గుంటూరులో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఈ రెండు టీమ్‌లు ఎంపికయ్యా పీడీ బి.నాగముని తెలిపారు.

క్రీడా సామాగ్రి పంపిణీ

పెనగలూరు, జనవరి20 : ఆడుదాం... ఆంధ్రా నియోజకవర్గ స్థాయిలో ఆడేందుకు వెళుతున్న క్రీడాకారులకు శనివారం సాయంత్రం ఏపీఎస్‌డీసీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డిలు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు.ఎంపీడీవో వరప్రసాద్, ఏవో పద్మభూషణ్‌రెడ్డి, ఈవోపీఆర్‌డి బాలకుమార్, హౌసింగ్ కార్పొరేట్ ఈ.హరిప్రసాద్, పీఆర్ఏఈ గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

"తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో జరిగిన తప్పిదాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటాం సరే... చేయించిన వారి సంగతేమిటి? ఎపిక్ కార్డులనేవి ఎన్నికల సంఘం ఆస్తి. మా ఆస్తిని కాజేయాలని చూస్తారా? ఇక్కడ ప్రజాస్వామ్యం వున్నట్టా? లేనట్టా? అధికారులు, ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి ఓటరు ఐడీ కార్డులు డౌన్‌లోడ్ చేయించిన వారెవరో తేల్చాలి...వారికి శిక్ష పడేలా చూడాలి... " ఇదీ కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారికి జారీచేసిన ఆదేశం. దీంతో ఓటరు ఐడీ కార్డుల డౌన్‌లోడ్, నకిలీ కార్డుల తయారీ వ్యవహారంలో సూత్రధారులెవర్నది తేల్చడానికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడు టెక్నికల్ టీములు ఏర్పాటయ్యాయి.మరోవైపు వివిధ రాజకీయ పక్షాల నాయకులు దొంగ ఓటర్ల వ్యవహారంపై ఇచ్చిన ఫిర్యాదుల పురోగతి, స్టేటస్ ఏమిటన్నది తేల్చడానికి విడిగా మరికొందరు అధికారులతో బృందాలు నియమితమయ్యాయి. దీంతో అధికారులను ముందు పెట్టి తెరవెనుక నుంచీ తతంగం నడిపించిన సూత్రధారులెవరన్నది త్వరలోనే వెలుగులోకి రానుంది.

సాంకేతిక అంశాల దర్యాప్తునకు టెక్నికల్ టీముల ఏర్పాటు

పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల స్టేటస్ కోసం విడిగా బృందాలు

సూత్రధారుల సంగతేంటి?



తిరుపతిలో దొంగ ఓటర్ల వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ఎన్నికల కమిషన్

చేసిన అధికారులపై చర్యలు సరే... చేయించిన వారి సంగతేమిటని ప్రశ్న

తిరుపతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలే లక్ష్యంగా తయారు చేయించిన దొంగ ఓటర్ల వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణిస్తోంది.ఈ వ్యవహారంలో తిరుపతి సెగ్మెంట్‌కు అప్పట్లో ఈఆర్వోగా పనిచేసిన నాటి తిరుపతి మున్సిపల్ కమిషనర్, ఇటీవలి వరకూ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన గిరీషాను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అలాగే అప్పటి తిరుపతి సెగ్మెంట్ ఏఈఆర్వోగా పనిచేసిన తిరుపతి అర్బన్ తహసిల్దారు జయరాములు, ఎలక్షన్ డీటీగా పనిచేసిన విజయ్‌భాస్కర్ కూడా సస్పెండయ్యారు. రికార్డుల ఆధారంగా ఈ వ్యవహారానికి బాధ్యులైన అధికారులందరిపై ఈసీ చర్యలకు ఉపక్రమిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి సమాంతరంగా మరో ప్రక్రియ మొదలైనట్టు తెలిసింది. పాత్రధారులైన అధికారులపై చర్యలు తీసుకుంటున్నామని, అయితే అధికారులతో ఈ తతంగం నడిపించిన సూత్రధారులెవరో తేల్చాలని ఈసీ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారిని ఆదేశించినట్టు తెలిసింది. సంబంధిత అంశంపై విచారణ త్వరగా ముగించి నివేదిక ఇవ్వాలని షరతు విధించినట్టు తెలిసింది. ఒకవేళ చేయలేని పరిస్థితి వుంటే తాము ఇతర ఏజెన్సీల ద్వారా సొంతంగా చేయించుకుంటామని కూడా స్పష్టం చేసినట్టు తెలిసింది. దీంతో సాంకేతిక అంశాలను తెలుసుకునేందుకు డీఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో మూడు టెక్నికల్ బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఆ బృందాలు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించాయని కూడా సమాచారం.ఈ బృందాలు ఎక్కడెక్కడ, ఏ కంప్యూటర్ సిస్టమ్స్ ద్వారా ఓటరు ఐడీ కార్డులు డౌన్‌లోడ్ చేశారు? ఎవరెవరి లాగిన్లలో చేశారు? ఎన్ని సెషన్లలో ఎన్నెన్ని కార్డులు డౌన్‌లోడ్ చేశారు?ఆయా కంప్యూటర్లు ఎవరు వినియోగించారు? వాటి ఐపీ అడ్రసులు ఏవి? వినియోగించిన నెట్ కనెక్షన్ ఎవరిది? మొబైల్ ద్వారా నెట్ వినియోగించి వుంటే ఆ మొబైల్ ఫోన్లు ఎవరివి?... ఇలా సాంకేతిక అంశాలను నిగ్గు తేల్చేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ మున్సిపల్, రెవిన్యూ కార్యాలయాల్లో కాకుండా ప్రైవేటు కార్యాలయాలు, ఇళ్ళలో గనుక ఈ తతంగం నడిచివుంటే, ప్రైవేటు కంప్యూటర్లు, ప్రైవేటు ఇంటర్‌నెట్ కనెక్షన్లు వినియోగించి వుంటే ప్రైవేటు వ్యక్తుల గుట్టు రట్టవుతుంది. వారి ద్వారా తెరవెనుక కుట్రదారులెవరన్నది తేలనుంది.

ఫిర్యాదుల పురోగతిని తేల్చే పనిలో మరిన్ని బృందాలు

మరోవైపు ఇతర జిల్లాలకు చెందిన డీఎస్పీ స్థాయి అధికారులకు ఇతర బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. తిరుపతి సెగ్మెంట్‌లో దొంగ ఓటర్లకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నాయకుల నుంచీ, వ్యక్తుల నుంచీ అందిన ఫిర్యాదులు ఏమయ్యాయనే కోణంలో ఈ విచారణ సాగనుంది. పోలీసు స్టేషన్లలో ఇచ్చిన ఫిర్యాదులు నమోదయ్యాయా? కాలేదా? నమోదై వుంటే దర్యాప్తు చేశారా? నిందితులను అరెస్టు చేశారా? ఛార్జిషీట్లు వేశారా? కోర్టులో ప్రస్తుతం ఆ కేసులు ఏ దశలో వున్నాయి? వంటి అంశాలను పరిశీలించి కేసుల స్థితిని ఈ బృందాలు నివేదించాల్సి వుందని సమాచారం. దీనికోసం పొరుగు జిల్లా నుంచీ ఇద్దరు డీఎస్పీలు ఇప్పటికే పలు మార్లు తిరుపతి వచ్చి వివరాలు సేకరించినట్టు తెలిసింది.

కీలకం కానున్న ఆ ఎమ్మెల్యే ఆడియో క్లిప్

తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లకు సంబంధించి అప్పట్లో ఓ వైసీపీ ఎమ్మెల్యే చేసిన ఫోన్ సంభాషణ తాలూకూ ఆడియో క్లిప్పింగ్ కీలకం కానుంది. ఎక్కడి నుంచో ఓ వ్యక్తి సదరు ఎమ్మెల్యేకి పోలింగ్ ముందురోజు ఫోన్ చేసి 450 మంది ఓట్లు వేయడానికి సిద్ధంగా వున్నారని, వారిని తీసుకురమ్మంటారా అని అడగడంతో వారి మధ్య జరిగిన సంభాషణ ఆడియో క్లిప్ అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అయింది. ఆ సంభాషణ యధాతథంగా....

సార్... రామ్ మాట్లాడతారు అన్న మాటతో సంభాషణ ప్రారంభమైంది.

ఎమ్మెల్యే : ఇప్పుడూ ఇంత రేత్రిలో కష్టమూ... వచ్చినా టైమ్ సరిపోదని మనోళ్ళ ఫీలింగ్
రామ్: అవునా సర్
ఎమ్మెల్యే: ఓటింగ్ టైమ్ సరిపోదు
రామ్: అంటే మనకు నైన్ అవర్సే కదా సర్ జర్నీ
ఎమ్మెల్యే : లేదు హడావిడైపోతుంది. 450 మందిని.. ఏడు బస్సులు కాదు పన్నెండు బస్సులు కావాలి.
రామ్: లేదు సర్ ఫిఫ్టీ మెంబర్స్ కెపాసిటీ కదా సర్.
ఎమ్మెల్యే: అవునయ్యా తొమ్మిది బస్సులు కావాలి. తొమ్మిది బస్సుల్లో వచ్చి మధ్యలో ఆపుతారు.చాలా ఇష్యూస్ వుంటాయి ఇక్కడ. దారిపొడుగూకా ఆపుతారు.
రామ్: అంటే మన టీమ్ వస్తున్నారు కద సార్. ఎంప్లాయీస్ వీళ్ళు కో ఆర్డినేట్ చేసుకుంటారు
ఎమ్మెల్యే: అది ముందు చూసుకోవల్ల... రెండు రోజుల ముందనుకోని వుంటే ప్లాన్ చేసుకోని వుండచ్చు
రామ్: ఆల్‌రెడీ మేమెప్పుడో చెప్పాము సార్ ఇది
ఎమ్మెల్యే: నాతో డిస్కస్ చేయలేదు ఎవరూ
రామ్: మేము సార్ గారికి చెప్పామూ... మీకు పంపించమని చెప్పేసరికి మేము
ఎమ్మెల్యే: ఇప్పుడు అందరినీ నిద్ర లేపి... నాలుగు గంటలకు బయల్దేరిపిచ్చి
రామ్: లేదు సర్ ఆల్రెడీ అందరికీ మేము
ఎమ్మెల్యే: ఈ 400 ఓట్లు ఇక్కడేసుకుంటాములే... ఏదో రకంగా మేనేజ్ చేసుకుని... వాళ్ళ ఓట్లు మనం ఎవరో ఒకరితో వేయించుకునేస్తే సరిపోతుంది... ఎందుకు పాపం వాళ్ళకు శ్రమ... మళ్ళా వచ్చి వెళ్లిపోవల్ల కదా... అంత శ్రమవద్దులే.. 400 ఓట్లు ఈడ వేసేసుకోవచ్చులే...
రామ్: సరే సర్

ఈ ఆడియో క్లిప్ అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొట్టింది. ప్రత్యేకించి తిరుపతి ప్రాంతంలో బాగా సర్క్యులేట్ అయింది. దీంట్లో సంభాషణ వింటే బహుశా హైదరాబాదులో ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీ వంటిచోట పనిచేస్తున్న తిరుపతి ప్రాంతానికి చెందిన 450మందిని తిరుపతికి తరలించి వారితో ఓట్లు వేయించేందుకు ఏర్పాట్లు చేసినట్టుగా వుంది. అది కూడా పోలింగ్ ముందురోజు రాత్రి ఫోన్ సంభాషణ జరిగినట్టు వుంది. పోలింగ్ రోజు తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి 9 గంటల్లో తిరుపతి చేరుకోవడం అంటే ఖచ్చితంగా హైదరాబాదు నుంచీ తరలించే ప్రయత్నమేనని భావించాల్సి వచ్చింది. ప్రయాణ వ్యవధి 9గంటలే అయినా మధ్య మధ్యలో పోలీసు, రవాణా శాఖల అధికారులు ఆపి తనిఖీ చేయడం, ఇతర అవసరాలకు వాహనాలు ఆపితే తిరుపతి చేరుకునే సరికి పోలింగ్ సమయం ముగిసిపోయే అవకాశమున్నందునే ఆ ప్రయత్నం విరమించుకుని వారి ఓట్లను ఇక్కడే ఎవరితోనైనా వేయించేయాలన్న నిర్ణయానికి వచ్చారని అనిపించింది. ఆడియో క్లిప్పింగ్ విన్న స్థానిక టీడీపీ నేతలు దీన్ని జత చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కాగా టీడీపీ అధినేత చంద్రబాబు సైతం దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పోలింగ్ ముగిసిన రెండో రోజు ఈ ఆడియో టేపు వెలుగు చూసింది. ఇపుడు దొంగ ఓటర్ల వ్యవహారంపై ఈసీ విచారణకు, చర్యలకు ఉపక్రమించిన నేపథ్యంలో ఈ ఆడియో టేపు కూడా కీలక ఆధారంగా మారే అవకాశముంది.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

చిత్తూరు (సెంట్రల్), జనవరి 20: నవోదయ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో విజయేంద్రరావు, నవోదయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 26 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 4789 మంది విద్యార్థులకుగాను 3919 మంది హాజరవగా, 870 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. డీఈవో ఐదు కేంద్రాలు, తాను ఐదు కేంద్రాలు పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 20: ఓపెన్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు డీఈవో విజయేంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు గడువు సోమవారానికి ముగుస్తున్న క్రమంలో ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. మీ-సేవ, ఏపీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు సిటీ, జనవరి 20: రోడ్డు భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను జిల్లా పోలీసు గ్రౌండ్‌లో కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ రిషాంత్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏటా రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు వాసుదేవరెడ్డి, మురళి, దీపిక, ఏఎంవీఐ ప్రసాద్ వర్మ, ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా రెడ్డెప్ప వద్దు, నారాయణస్వామి కావాలి

జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 20: జీడీ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డెప్ప వద్దని, నారాయణస్వామి కావాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల వైసీపీ అధ్యక్షులు, పార్టీ నేతలు వేర్వేరుగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వైసీపీ అధిష్ఠానం నాల్గవ విడతగా విడుదల చేసిన ఎమ్మెల్యే, ఎంపీల జాబితాలో ప్రస్తుత జీడీ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని చిత్తూరు ఎంపీగా.. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని వైసీపీ నేతలు నారాయణ స్వామికే తిరిగి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నారాయణ స్వామికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోతే తమ పదవులకు రాజీనామా చేస్తామని అల్టిమేటం జారీచేశారు. అలాగే రెడ్డెప్పకు తాము సహకరించబోమని తేల్చి చెప్పారు.

గీజర్ పేలి వృద్ధురాలి మృతి

చిత్తూరు, జనవరి 20: ప్రమాదవశాత్తూ గీజర్ పేలడంతో ఓ వృద్ధురాలు మృతి చెందారు. చిత్తూరు నగరంలోని సాంబయ్యకండ్రిగలో ప్రేమలత(73) శనివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో గీజర్ ఆన్‌చేయగా, అది ప్రమాదవశాత్తూ పేలిపోయింది. ఈ ఘటనలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడగా, సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఒకటో పట్టణ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

బోగస్ ఓట్ల పునఃపరిశీలనలో యంత్రాంగం బిజీబిజీ

తిరుపతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):తిరుపతి దొంగ ఓట్ల కుంభకోణంపై ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలతో అధికారులు అప్రమత్తమయ్యారు.ఫైనల్ ఓటరు జాబితాను తప్పుల్లేకుండా చూసే పనిలో పడ్డారు. తిరుపతి అసెంబ్లీకి ఈఆర్వోగా ఉన్న మున్సిపల్ కమిషనర్ హరిత సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకూడదని హెచ్చరిస్తున్నారు. బీఎల్వోలు, ఇతర అధికారులతో కలిసి జాబితాను పునఃపరిశీలిస్తున్నారు. తాజాగా గుర్తించిన నకిలీ ఓట్ల జాబితాను ఇవ్వాలని విపక్ష పార్టీ నేతలను అడిగి తెప్పించుకుంటున్నట్టు సమాచారం. చంద్రగిరి నియోజకవర్గ ఈఆర్వోగా ఉన్న ఆర్డీవో నిషాంత్ రెడ్డిపై కూడా ఈసీ కొరడా ప్రభావం కనిపిస్తోంది. రెవెన్యూ సిబ్బందిని కాకుండా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 10మంది సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకున్నారు. ప్రతి మండలానికీ ప్రత్యేకాధికారులను నియమించి ఓటర్ల జాబితా పునఃపరిశీలనలో బిజీబిజీగా కనిపిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి ర్యాండమ్‌గా తనిఖీ చేస్తున్నారు.గుర్తించిన నకిలీ ఓట్లను తొలగించే పనిలో పడ్డారు. ఈ క్రమంలో వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి పదిమందిపై కేసులు కూడా నమోదు చేసినట్టు తెలిసింది.

ఆ ఓట్ల జాబితా ఇవ్వండి : టీడీపీ

దొంగ ఓట్ల కుంభకోణంలో ప్రధాన పాత్రను వైసీపీ కార్యాలయాలు పోషించాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తిరుపతి ఉప ఎన్నికకు సంబంధించి నాటి ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్(ఈఆర్వో) లాగిన్ నుంచి దాదాపు 34వేల బోగస్ ఎపిక్ కార్డులు ముద్రించారని ఎన్నికల కమిషన్ గుర్తించిన విషయం తెలిసిందే.ఎన్నికల సంఘం గుర్తించిన దొంగ ఓట్ల జాబితా కావాలని టీడీపీ తిరుపతి ఇన్‌చార్జి సుగుణమ్మ శనివారం కలెక్టర్ వెంకట్రమణా రెడ్డిని, కమిషనర్ హరితను కలిసి కోరారు. అయితే ఆ జాబితా తమ వద్దలేదని పోలీసుల విచారణలో ఉందని వారు చెప్పారు.ఈ సందర్భంగా సుగుణమ్మ మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో వైసీపీ నేతల పనులతో అధికారులు బలైపోతున్నారన్నారు. ధర్మయుద్ధం చేయమని తాము పదేపదే చెబుతున్నామని, అయితే వారు దొంగ ఓట్లపైనే ఆధారపడుతున్నారని మండిపడ్డారు. ఫేక్ ఓటరు లేకుండా పునఃపరిశీలన చేసి అసలైన ఓటరు జాబితాతో ఎన్నికల్లోకి రావాలని చెప్పారు. అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని కోరారు. టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, బుల్లెట్ రమణ, శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, చిన బాబు, మహేష్ యాదవ్, పుష్పావతి, కృష్ణ యాదవ్, కంకణాల రజనీకాంత్, కరాటే చంద్ర, ఆముదాల తులసి తదితరులు ఆమె వెంట వున్నారు.

ఆలయ నిర్మాణాన్ని ధ్వంసం చేసిన వైసీపీ నాయకుడు

స్థానికుల ఫిర్యాదుతో సర్దుబాటు చేసిన తహసీల్దారు

చౌడేపల్లె, జనవరి 20: ఓ ఆలయ నిర్మాణాన్ని స్థానిక వైసీపీ నాయకుడు అడ్డుకుని, ధ్వంసం చేశాడు. స్థానికులు వెంటనే తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో ఆయన సిబ్బందిని పంపి సర్దుబాటు చేయాల్సి వచ్చింది. ఈ సంఘటన చౌడేపల్లె మండలంలో శనివారం జరిగింది. చౌడేపల్లె పంచాయతీ చిన్నకొండామారి గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ చివరిలో కొన్ని తరాలుగా కాటంరాజు ఆలయం ఉంది. ఆలయం మర్మతులకు గురవడంతో ఈనెల 24వ తేదీన పశువుల పండుగ నిర్వహణకు గ్రామస్తులంతా చందాలు వేసుకుని పునఃనిర్మాణం చేపట్టారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, 13వ వార్డు సభ్యురాలు గుర్రమ్మ భర్త బాబు ఆ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. నిర్మాణంలోని ఆలయ గోడలను సైతం గడ్డపారతో ధ్వంసం చేశారు. ఈ విషయంపై గ్రామస్తులు వెంటనే తహసీల్దార్ మాధవరాజుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన రెవెన్యూ సిబ్బందిని పంపించి బాబుకు సర్దిచెప్పడంతో వివాదం సర్దుమణిగింది. దాంతో తిరిగి గ్రామస్తులు ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు.



కాటంరాజు ఆలయ నిర్మాణాన్ని ధ్వంసం చేస్తున్న వైసీపీ నాయకుడు బాబు

జనసేన రాయలసీమ జోన్ కమిటీ నియామకం

చిత్తూరు సిటీ, జనవరి 20: జనసేన రాయలసీమ జోన్ కమిటీని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. అందులో చిత్తూరుకు చెందిన దేవినేని యశ్వంత్, రాకేష్ కో-కన్వీనర్లుగా, రమేష్, పూల ప్రభాకర్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

పలువురు ఎస్ఈబీ ఎస్ఐల బదిలీ

చిత్తూరు సిటీ, జనవరి 20: జిల్లాలో పలువురు ఎస్ఈబీ ఎస్ఐలను బదిలీ చేస్తూ అనంతపురం ఎస్ఈబీ డీసీ శనివారం ఆదేశాలు జారీచేశారు. చిత్తూరు అర్బన్ ఎస్ఐ రామ్‌ప్రసాద్‌ని సత్యసాయి జిల్లా మడకశిరకు బదిలీ చేశారు. అలాగే చిత్తూరు రూరల్‌లోని జి.మోహన్‌బాబును కడప జిల్లాబద్వేలుకు, కార్వేటినగరంలోని కె.భాస్కర్‌ని అనంతపురం జిల్లా డీటీఎఫ్‌కు, బి.జయశంకర్ తిరుపతి జిల్లా చంద్రగిరికి, నగరిలోని పి.భానుప్రకాష్‌ను సత్యసాయి జిల్లా తనకల్లుకు, పలమనేరులోని బి.రామదాసును కడప డీటీఎఫ్‌కు, పుంగనూరులోని జి.అశోక్‌కుమార్‌ని తిరుపతి రూరల్‌కు, పులిచెర్లలోని వి.కామేశ్వరనాయుడిని అన్నమయ్య జిల్లా రాయచోటి డీటీఎఫ్‌కు, వి.కోట చెక్‌పోస్టులోని ఏవీ రమణరాజును తిరుపతి జిల్లా పుత్తూరుకు, ఎన్ఆర్ పేట చెక్‌పోస్టులోని టి.వెంకటరత్నంను అనంతపురం జిల్లా కంబదూరుకు, క్యాటిల్‌ఫారం చెక్‌పోస్టులోని ఎ.విజయ్‌కుమార్‌ని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంకు, చిత్తూరు డీటీఎఫ్‌లోని మస్తాన్‌వలీని సత్యసాయి జిల్లా మడకశిరకు, చిత్తూరు ఇంటెలిజెన్స్‌లోని పృథ్వీరాజ్‌ను కర్నూలు జిల్లా పంచలింగాలకు, పలమనేరులోని ఎ.రామమూర్తిని కర్నూలు జిల్లా హన్నకొండకు, చిత్తూరు డీటీడబ్ల్యూ ఎస్ఐ కె. బాబును కర్నూలు జిల్లా సుంకేశులకు బదిలీ చేశారు.

పక్క జిల్లాల నుంచి ఇలా..

అనంతపురం ఎస్ఐ కె.పవన్‌కుమార్‌ని చిత్తూరు అర్బన్ స్టేషన్‌కు, అనంతపురం జిల్లా రాయదుర్గంలోని ఎం.హరికృష్ణను పుంగనూరుకు, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలోని బి.కృష్ణానాయక్‌ని నగరికి, అనంతపురం జిల్లా కంబదూరులోని ఆర్.మునస్వామిని ఎస్.ఆర్.పేట చెక్‌పోస్టుకు, సత్యసాయి జిల్లా ధర్మవరంలోని టి.సుశీలమ్మను వి.కోట చెక్‌పోస్టుకు, సీకేపల్లిలోని కె.నాగరాజును చిత్తూరు రూరల్ స్టేషన్‌కు, కడపలోని సి.భారతిని కార్వేటినగరానికి, కడప జిల్లా బద్వేలు ఎస్ఐ ఎస్.రూపను చిత్తూరు డీటీఎఫ్‌గా బదిలీ చేశారు.

కర్ణాటక మద్యం విక్రయ ముఠా గుట్టు రట్టు

5వేల టెట్రా ప్యాకెట్ల స్వాధీనం - ఇద్దరి అరెస్టు, మరో ఏడుగురిపై కేసు నమోదు, ఓ వ్యాన్ సీజ్

గంగవరం, జనవరి 20: కర్ణాటక మద్యాన్ని తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. దాదాపు 5వేల (90 ఎంఎల్) టెట్రాప్యాకెట్లు, ఓ వ్యానును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి, మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఆ వివరాలను శనివారం గంగవరం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో పట్టుబడిన మద్యంతోపాటు నిందితుల వివరాలను పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి మీడియాకు తెలిపారు. కొంతకాలంగా కర్ణాటక నుంచి మద్యం కొనుగోలు చేసి గంగవరం మండలంతోపాటు పరిసరప్రాంతాలకు సరఫరా చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో గంగవరం సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో శుక్రవారం రాత్రి పలమనేరు-బెంగళూరు రహదారిలో గంగవరం మండల పరిధిలోని పత్తికొండ బస్టాప్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. పోలీసులను చూసి ఓ వ్యాను వేగంగా వెళ్లిపోతుండటంతో వెంబడించి ఆపారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో అట్టబాక్సులు కనిపించాయి. వాటిని తెరవగా కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు బయటపడ్డాయి. వాహనంలోని గంగవరం మండలం బెస్తగానిపల్లెకు చెందిన కేశవులు, కురపల్లెకు చెందిన గంగాధర్‌లను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా, వీరు గంగవరం మండలం కురపల్లె గిరి ఆదేశానుసారం అతడికి చెందిన ఓ వ్యానులో కర్ణాటక రాష్ట్రం నంగిలి బోర్డర్‌లో ఉన్న దీపిక వైన్స్‌లో పని చేసే క్యాషియర్ శేఖర్ సహకారంతో మద్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ మద్యం ప్యాకెట్లను మండలంలోని పసపత్తూరు, మాడి, నిడిగుంట గ్రామాల మీదుగా తీసుకొచ్చి.. కురపల్లెకి చెందిన బాబు, హరి, నాయనిచెరువుకు చెందిన మణి, పత్తికొండకు చెందిన వెంకట్రామయ్య, బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకు చెందిన నందకుమార్‌కు అందించేవారు. అందరూ కలిసి ఓ ముఠాగా పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు మద్యాన్ని విక్రయించి, జల్సాలు చేసేవారని డీఎస్పీ తెలిపారు. దాంతో కేశవులు, గంగాధర్‌లను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి రూ.8లక్షల విలువైన కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లతోపాటు వ్యానును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు చెప్పారు. ఈ మద్యం విక్రయాలతో సంబంధం ఉన్న మిగిలిన ఏడుగురిపైనా కేసు నమోదు చేశామని, త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన గిరిపై ఇప్పటికే గంగవరం, బైరెడ్డిపల్లె స్టేషన్లలో మూడు, పలమనేరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఓ కేసు కలిపి మొత్తం నాలుగు కేసులు, కేశవులుపై బైరెడ్డిపల్లె, గంగవరంలో మూడు కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎన్నిసార్లు పట్టుబడినా తీరు మారకపోవడంతో గిరిపై పీడీయాక్టు కోసంపై అధికారులకు సిఫారసు చేయనున్నట్లు డీఎస్పీ స్పష్టం చేశారు.



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

అంగన్వాడీలంటే అంత చులకనా..!

● నిరవధిక సమ్మెను మరింత ఉధృతం చేస్తాం ● 40వ రోజు కొనసాగిన అంగన్వాడీల నిరసనలు


తంబళ్లపల్లెలో రాస్తా రోకో చేస్తున్న అంగన్వాడీలు


వాల్మీకిపురంలో రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

మదనపల్లె టౌన్, జనవరి 20: అంగన్వాడీల సమ్మెను చులకనగా చూస్తున్న ప్రభుత్వానికి తమ సత్తా తెలిపేందుకు నివరధిక సమ్మెను ఉధృతం చేస్తామని అంగన్వాడీలు హెచ్చరించారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టరేట్ వరకు అంగన్వాడీలు ర్యాలీగా వచ్చి సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. షోకాజ్‌నోటీసులకు రిప్లై ఇచ్చినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. దీనికి నిరసనగా ధర్నా, రాస్తారోకో చేయాల్సి వచ్చిందన్నారు. అంగన్వాడీల నిరసనలకు మద్దతుగా సీపీఎం నాయకులు హరీంద్రనాథ్‌శర్మ, ప్రభాకర్‌రెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి గంగాదేవి, మధురవాణి, గీత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు స్థానిక మూడు రోడ్ల కూడలిలోని సమ్మె శిబిరం వద్ద మదనపల్లె-తంబళ్లపల్లె ప్రధాన రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ..ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకుండా ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా అంగన్వాడీ కేంద్రాలు తెరిచేది లేదన్నారు. ఇన్ని రోజులుగా అంగన్వాడీలు ఇళ్లు, కుటుంబాలను వదిలి రోడ్లెక్కి నిరసనలు చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఈ ఏడాదిలో దాదాపు అన్ని పండుగలు ఆకలి పస్తులతో రోడ్లపైనే జరుపుకున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిమాండ్లు నెరవేర్చాలని లేకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 40 వరోజుకు చేరింది. దీక్షా శిబిరంలో ధర్నా చేసిన అనంతరం ర్యాలీగా జ్యోతి బస్టాండు వరకు చేరుకుని బస్టాండు కూడలిలో అంగన్వాడీ కార్యకర్తలు రాస్తారోకో, మానవహారం చేశారు. అంగన్వాడీల కోర్కెలు తీర్చాలని, ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని నినాదాలు చేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి మనోహర్‌రెడ్డి, సలీంబాషాలు వారికి సంఘీభావంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మళ్లీ ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు చేరుకుని అంగన్వాడీలు ధర్నాను కొనసాగించారు. ఈ సందర్భంగా బి.కొత్తకోట సీడీపీవో భాగ్యమ్మ దీక్షా శిబిరంలోకి వచ్చి శనివారం 4 గంటలలోగా విధుల్లో చేరాలని లేని పక్షంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల స్థానంలో మరొకరని ప్రభుత్వం నియమించుకుంటుందని అల్టిమేటం ఇచ్చారు. అయినా ధర్నాలో కూర్చున్న అంగన్వాడీలు కార్యకర్తలు తగ్గకుండా తాము ధర్నాను కొనసాగిస్తామని సీడీపీవోకు స్పష్టం చేశారు. యూనియన్ లీడర్లు శ్రీవాణి, కుమారిలు మాట్లాడుతూ తమ డిమాండ్లు తీర్చమంటే బెదిరిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. కార్యక్రమంలో ములకలచెరువు, బి.కొత్తకోట, పీటీఎం మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: ఎన్నికల ముందు హామీలు ఇచ్చి తర్వాత మాట తప్పడం అంగన్వాడీల కనీస వేతనాల సమస్యను పరిష్కరించలేని వైసీపీ చేతకాని దద్దమ్మ ప్రభుత్వమని వాల్మీకిపురంలో అంగన్వాడీ కార్యకర్తలు ధ్వజమెత్తారు. శనివారం 40రోజు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు రహదారిపై రాస్తారోకో చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కుటుంబాలను వదిలి రోడ్డున పడి సమ్మె చేస్తుంటే తమపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కనికరం లేకుండా పోయిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ తక్షణమే దిగి వచ్చి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు.

మాజీ సర్పంచ్ లక్ష్మయ్య మృతి నివాళులర్పించిన మాజీ సీఎం


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

కలకడ, జనవరి 20:మండలానికి చెందిన సీనియర్ నాయకుడు బాలయ్యగారిపల్లె మాజీ సర్పంచ్ లక్ష్మయ్య(82) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. రాజకీయాల్లో లక్ష్మయ్య నల్లారి కుటుంబానికి అత్యంత సన్నిహితంగా పని చేశారు. విషయం తెలిసిన వెంటనే మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, అంతకుమునుపు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆయన భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని సంతాపాన్ని వ్యక్తం చేశారు. సీనియర్ నాయకుడ్ని కోల్పోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో మాజీ సీఎం తనయుడు నల్లారి నిఖిలేష్‌రెడ్డి, నల్లారి శ్రీధర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, కృష్ణప్ప, రవీంద్రరెడ్డిలున్నారు. అలాగే కిషోర్‌కుమార్‌రెడ్డి వెంట టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్, నాయకులు ప్రభాకర్‌నాయుడు, విశ్వనాథ్, రైస్‌మిల్ రమణ, ఈశ్వరయ్య, మున్వర్, మెకానిక్ ఈశ్వర ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బికొత్తకోట జనవరి 20 : మండలంలోని బీరంగి పంచాయతీ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గొర్రెల కాపరులు ద్వారా విషయం బయటకు పొక్కడంతో బి.కొత్తకోట ఏఎస్ఐ బొజ్జానాయక్, కానిస్టేబుల్ రవి తదతరులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సుమారు నెల రోజుల క్రితం మృతి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహం పూర్తిగా తరిగి పోయి కళేబరం మాత్రం దొరికింది. దీన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గుర్తు తెలియని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బొజ్జానాయక్ పేర్కొన్నారు.

మదనపల్లెలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

మదనపల్లె టౌన్, జనవరి 20: మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె వెళ్లే మార్గంలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం బయటపడింది. శనివారం అంకిశెట్టిపల్లె గ్రామస్థులు మదనపల్లెకు వస్తుండగా రోడ్డు పక్కన ఉన్న సమాధుల మధ్య మృతదేహం సమీపంలో కుక్కలు అరుస్తుండటంతో వెళ్లి మదనపల్లె తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. తాలూకా సీఐ శేఖర్ అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం బాగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉంది. మృతదేహం పక్కన చీర ఉండటంతో అది మహిళ మృతదేహం అని పోలీసులు నిర్ధారించారు. సీఐ మాట్లాడుతూ గ్రామస్థులను విచారించామని ఇక్కడ గుర్తుతెలియని మహిళ తిరిగేదని బహుశా ఆమె అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని, లేదా ఈ ప్రాంతంలో ఎక్కువ సమాధులు ఉండటం మూలాన, ఎవరైనా అంత్యక్రియలు చేసేందుకు గుంతను తవ్వగా ఈ మృతదేహం బయటపడిఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. చుట్టుపక్కల మండలాల్లో ఎవరైనా మహిళ అదృశ్యం అయినట్లు ఫిర్యాదులు వచ్చాయేమో తెలుసుకుంటున్నామని సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్యూటీఆపరేటర్‌కు తీవ్రగాయాలు

మదనపల్లె టౌన్, జనవరి 20: రోడ్డుప్రమాదంలో సబ్‌స్టేషన్ డ్యూటీ ఆపరేటర్ తీవ్రగాయాల పాలయ్యాడు. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెకు చెందిన కిశోర్(30) బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు వద్ద సబ్‌స్టేషన్‌లో డ్యూటీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో కిశోర్ ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న ప్రమాదంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కిశోర్‌ను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు బి.కొత్తకోట పోలీసులకు సమాచారం అందజేశారు.

సారా కేసులో ఇద్దరు మహిళలు అరెస్టు

గుర్రంకొండ, జనవరి 20:అక్రమంగా సారా తరలిస్తున్న ఇద్దరు మహిళలను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని చెర్లోపల్లె పంచాయితీ గామిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటలక్ష్మ, లక్ష్మీదేవిలు కలకడ మండలం దిగువతాండకు చెందిన మణినాయక్ నుంచి సారాను కొనుగోలు చేసి విక్రయించడానికి తీసుకెళుతుండగా మహిళలిద్దర్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గుర్రంకొండ, జనవరి 20:గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. కాలనీకి చెందిన ఓ వ్యక్తి చిల్లర దుకాణంలో మద్యం బాటిళ్లను ఉంచుకొని అమ్ముతున్నట్లు తెలియడంతో పోలీసులు దాడి చేసి పట్టుకొన్నారు. అతని వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే శంకర్ పరామర్శ


కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్

ములకలచెరువు/బి.కొత్తకోట, జనవరి 20: ములకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్, పీటీఎం మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు బూర్లపల్లె కృష్ణారెడ్డిని శనివారం తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ పరామర్శించారు. తీవ్ర అస్వస్థతకు గురై బెంగళూరులోని సెయింట్ జాన్స్ ఆస్పత్రిలో కృష్ణారెడ్డి చికిత్సలు పొందుతున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ ఆస్పత్రికి వెళ్ళి పరామర్శించారు. అలాగే ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఆయన వెంట బి.కొత్తకోట మండల పార్టీ అధ్యక్షుడు నారాయణస్వామిరెడ్డి, నేతలు కుడుం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.
గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న కృష్ణారెడ్డి ఇటీవల పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు బెంగళూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే శంకర్ యాదవ్ శనివారం సెయింట్ జాన్స్ ఆసుపత్రికి వెళ్లి కృష్ణారెడ్డిని పరామర్శించారు. కుమారుడు మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డిని, కుటుంబీకులను కలిసి ధైర్యం చెప్పారు. ఆయన వెంట బికొత్తకోట మండలానికి చెందిన టీడీపీ నాయకులు కనకంటి ప్రసాద్, శ్రీనాథ్, సుకుమార్, బీరంగి గోపి పాల్గొన్నారు.

ప్రశాంతగా ముగిసిన నవోదయ పరీక్ష

తంబళ్లపల్లె, జనవరి 20: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు అబ్జర్వర్, ఎంఈవో త్యాగరాజు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లలో నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 144 మంది విద్యార్థులకు గానూ 124 మంది విద్యార్థులు హాజరవ్వగా, మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 140 మందికి గానూ 117 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ


కబడ్డీ పోటీలల్లో ఎంపికైన మోడల్‌స్కూల్ విద్యార్థినులు

నిమ్మనపల్లి, జనవరి 20: మండలంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర పోటీలలో మోడల్‌స్కూల్ విద్యార్థినులు విజయం సాధించినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ దాదాపు 20రోజులుగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీలలో పలు పాఠశాలల నుంచి, విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో క్రికెట్ కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీ లలో ముష్టూరు, రెడ్డివారిపల్లె, రాచివేటివారిపల్లె, నిమ్మనపల్లె, అగ్రహారం కొండయ్యగారిపల్లె పంచాయతీల్లోని విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ బద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌పీటీఈఎల్‌లో మిట్స్‌కు ఏపీ ర్యాంకింగ్

కురబలకోట, జనవరి 20: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్‌పీటీఈఎల్‌లో ఏపీ ర్యాంకింగ్ దక్కినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. గతేడాది జూలై నుంచి డిసెం బరు దాకా 6338 మంది దరఖాస్తు చేసుకోగా 5538 మంది ఉత్తీర్ణత సర్టిఫికెట్లను సాధించారు. కాగా కళాశాలకు ఏపీ ర్యాంకింగ్‌తో పాటుగా జాతీయ స్థాయిలో టాప్ 10 స్థానం దక్కింది. చెన్నై ఐటీలో జరి గిన అవార్డుల కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి పృధ్విరాజన్ ఈ అవార్డును అందుకున్నాడు. ఈ ర్యాంకింగ్ రావడంతో కరస్పాం డెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ అభినందించారు.

రేషన్ డీలర్లను పట్టించుకోని ప్రభుత్వం

వాల్మీకిపురం, జనవరి 20: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదని అన్నమయ్య జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సుధీర్ పేర్కొన్నారు. శనివారం వాల్మీకిపురం మండలం చింతపర్తిలో డివిజన్ స్థాయి డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది జూలై 22న విజయవాడలో జరిగిన డీలర్ల మహా సభలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలాలి, సహాయ కార్యదర్శి జయప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్, గంగాధర్, బాషా, శివ రామిరెడ్డి, నాయకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

మదనపల్లె అర్బన్, జనవరి 20: రోడ్డుభద్రతా నిబంధనలను పాటించాలని జిల్లా డిప్యూటీ సీఎంఈ నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజీలో మదనపల్లె వన్, టూ డిపోల ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నాగేశ్వరరావు మాటాడారు. కార్యక్రమంలోటూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య, టూటౌన్ రైటర్ రామమూర్తి, వన్, టూ డిపోల యూనియన్ నాయకులు, సూపర్‌వైజర్లు ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్యాలెట్ ద్వారా మత్స్యకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

మదనపల్లె టౌన్, జనవరి 20: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి నిర్వహించే మత్స్యకార సంఘాల ఎన్నికలను ఈ సారి బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని ఏపీ మత్స్యకారుల ఐక్య కార్యచరణ కమిటీ జిల్లా కన్వీనర్ మడితం రమణ విన్నవించారు. శనివారం స్థానిక సబ్ కలెక్టరేట్ డీఏవో శేషయ్యను కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మత్స్యకార సంఘాల ఎన్నికలు సభ్యులు చేతులెత్తి నాయకులను ఎన్నుకునే విధంగా నిర్వహిస్తున్నారని, దీని వలన కొందరు సభ్యులను భయపెట్టి తమ వైపు ఓట్లు వేయించుకుంటున్నారన్నారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల్లో సభ్యులు నిర్భయంగా ఓట్లు వేయాలంటే సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని కోరారు.

చట్టం, న్యాయాలపై అవగాహన తప్పనిసరి

వాల్మీకిపురం, జనవరి 20: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టం, న్యాయాల పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని వాల్మీకిపురం సబ్‌రిజిస్ట్రార్ స్వరూప్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ సురేష్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వేలం పాటల ద్వారా మల్లయ్యకొండకు రూ.15లక్షల ఆదాయం


వేలం పాటలు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

తంబళ్లపల్లె, జనవరి 20: తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఏడాది పాటు వివిధ హక్కులు పొందడానికి నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.15,04,500లు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. శనివారం మల్లయ్యకొండ పైన ఆలయం వద్ద ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి, ఈవో రమణ, ఛైర్మన్ కేఆర్‌మల్‌రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. తలనీలాలు ప్రోగు చేసుకొను హక్కును తంబళ్లపల్లె నాయీ బ్రాహ్మణులు రూ.3.50లక్షలకు, పూజా సామగ్రి విక్రయించుకొను హక్కులు పొందడానికి గౌరమ్మ గుడి వద్ద శ్రీనివాసులు రూ.2,15,000లకు, ఏనుగుమల్లమ్మ గుడి వద్ద సిద్ధమల్లప్ప రూ.1,60,000, వీరన్నగెవి వద్ద బి.బయ్యప్ప రూ.13,500 కొండ పైన దేవస్థానం వద్ద కొబ్బరిచిప్పలు సేకరించుకొను హక్కును మణికంఠ రూ.80వేలకు, దుకాణాల రుసుము వసూలు హక్కును నరసింహులు రూ.60 వేలకు, లడ్డూ ప్రసాద విక్రయ హక్కును కె.మోహన రూ.6,26,000లకు వేలం పాటలో దక్కించుకున్నట్లు తెలిపారు. కాగా, అనివార్య కారణాల వలన వాహనాల పార్కింగ్(టోల్ గేట్) హక్కులకు ఈ నెల 29న వేలం పాట నిర్వహిస్తామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె-2 సర్పంచ్ పార్వతమ్మ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కరీం, ఆలయ పాలక మండలి సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది ఈశ్వర స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో విశేషపూజలు


మాట్లాడుతున్న ఆలయకమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, జనవరి 20: అయోధ్య రామమందిరంలో ఈ నెల 22న శ్రీరాముల విగ్రహప్రతిష్ఠ నిర్వహిస్తున్న సందర్భంగా మదనపల్లె వరాల ఆంజనేయస్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సోమవారం ఉదయం నుంచి వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు, విశేషపూజలు నిర్వహిస్తున నట్లు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవ సందర్భంగా స్థానిక అమ్మచెరువు మిట్టలోని కార్యసిద్ధి అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ హనుమాన్ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు భారత మాత స్ఫూర్తి కేంద్రం, సరస్వతి మందిరం సభ్యులు తెలిపారు. నీరుగట్టువారిపల్లె కాట్లాటపల్లె రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం వెంకటరత్నం పేర్కొన్నారు. స్థానిక కమ్మగడ్డవీధిలో శ్రీరాములు ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పూజలు అనంతరం భక్తులకు అన్నదాన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, జనవరి 20: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథంలో వెలసిన శ్రీకార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా వైభవంగా నిర్వహించారు. సోమవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా ఆలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని ప్రత్యేకంగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి అనంతరం కల్యాణం నిర్వహించారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేశారు.

ఘనంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



కలకడ, జనవరి 20: మండలంలోని కదిరాయచెరువు పంచాయతీలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఘనంగా జరుపుకున్నారు. ఇక్కడికి విచ్చేసిన ప్రచార రథానికి సర్పంచ్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో పీలేరు అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ పోత్తూరి శ్రీకాంత్ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి, ఈవోఆర్డీ లతీఫ్‌ఖాన్, కోఆర్డినేటర్ మనోహరగౌడ, కార్యదర్శి జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలి


మాలమహానాడు అధ్యక్షుడు సుదర్శనంతో చర్చలు జరుపుతున్న సీఐ సురేష్‌కుమార్

కలికిరి, జనవరి 20: దళితులకు చెందిన భూమిని ఆక్రమించుకోవడమే కాకుండా వారిపై దాడులు చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం డిమాండు చేశారు. కేసు నమోదు చేసినా చర్యలు తీసుకోకుండా పోలీసులు తాత్సారం చేయడంపై ఆయన మండిపడ్డారు. కలికిరి శివారులోని ఒక భూమికి సంబంధించి గురువారం రాత్రి దళితులపై కొంత మంది దాడులు చేసి తీవ్రంగా గాయపరిచారని, శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినా నిందితులను అరెస్టు చేయకుండా పోలీసులు జాప్యం చేస్తున్నారని మాలమహానాడు ఆధ్వర్యంలో శనివారం పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం క్రాస్‌రోడ్డు కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ వెంటనే నిందితులను అరెస్టు చేసి శిక్షించకపోతే ధర్నాలు, నిరసనలు నిరవధికంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. మానవహారంతో ధర్నా కొనసాగుతుండగా వాల్మీకిపురం సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర రావు, సిబ్బందితో వచ్చి ఉద్యమకారులతో చర్చలు జరిపి నిందితులపై తప్పనిసరిగా చర్యలుంటాయని హామీ ఇచ్చారు. అక్కడి నుంచే రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషాతో మాట్లాడించారు. కేసు తీవ్రత దృష్ట్యా దళిత సంఘాల డిమాండు మేరకు 307 సెక్షనుతో కేసు నమోదు చేస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. పోలీసు అధికారుల స్పష్టమైన హామీలతో దళిత నాయకులు ధర్నా విరమించారు. అయితే ధర్నా విరమణ తాత్కాలికమేనని, పోలీసుల వైపు నుంచి చర్యలు లేకుంటే రేపటి నుంచి తిరిగి కొనసాగిస్తామని మాలమహానాడు అధ్యక్షుడు యమలా సుదర్శనం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శనంతోపాటు కార్యదర్శి అశోక్, వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్టీడీ హరి, నాయకులు చంద్ర, గుండా మనోహర్, మైనారిటీ జేఏసీకి చెందని హనీఫ్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు చర్యలు ప్రారంభం

కాగా దళితులపై దాడులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదు చేసిన సెక్షన్లను ఆధారంగా చేసుకుని ఎస్సీ, ఎస్టీ విభాగం మదనపల్లె డీఎస్పీ సుధాకర్ శనివారం సాయంత్రం విచారణ చేపట్టారు. సంఘటన స్థలం, దాడి సందర్భంగా తీసిన వీడియోలు, బాధితుల గాయాలను పరిశీలించిన అనంతరం ఎస్సీ, ఎస్టీ చట్టం కింద విచారణ చేపట్టడానికి కావలసిన ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు నిర్ధారించారు. కాగా ఆందోళన చేస్తున్న దళిత సంఘాల డిమాండ్ మేరకు దాడి కేసును 307 సెక్షన్ కింద కూడా విచారించడానికి పోలీసు అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

ముస్లీం మైనారిటీల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం


బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీలో ఎస్ఏ మస్తాన్, టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 20: రాష్ట్రంలో ముస్లీం మైనారిటీల సంక్షేమం టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని ఆ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మోతీనగర్‌లోని 13వ వార్డులో ఇన్‌చార్జి ఎస్ఏ నస్రీన్ తాజ్, ఎస్ఏ మస్తాన్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు టీడీపీ నాయకులు ఇంటింటా తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎం రఫి, ఎస్ఎల్‌వీ రఘు, దాదాపీర్, ఖాదర్‌వలి, సర్తాజ్, సోమశేఖర్, బావాజాన తదితరులు పాల్గొన్నారు..

పీలేరులో రా.. కదలిరా సభ వాయిదా

మదనపల్లె టౌన్, జనవరి 20: పీలేరులో ఈనెల 24న చంద్రబాబు పాల్గొనాల్సిన రా.. కదలిరా సభ వాయిదా వేసినట్లు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అయోధ్యలో ఈనెల 22వ తేదీ రామమందిరంలో రామ్‌లాలా ప్రతిష్ఠ కార్యక్రమానికి చంద్రబాబుకు ఆహ్వానం అందిందన్నారు. ఈ క్రమంలో ఆయన 21న అయోధ్యకు వెళ్లి మరుసటి రోజున రాష్ట్రానికి చేరుకుంటారన్నారు. దీని కారణంగా పీలేరులో ఈనెల 24న నిర్వహించాల్సి బహిరంగ సభ ఈనెల 27వ తేదీకి వాయిదా పడినట్లు తెలిపారు. మదనపల్లె, పుంగనూరు, తంబళ్లపల్లె టీడీపీ కార్యకర్తలు గమనించాలని ఆయన కోరారు.

సచివాలయ సర్వేయర్ నిర్వాకంపై ధర్నా

●న్యాయం చేస్తామంటూ తహసీల్దార్ హామీ


గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రఫిక్ అహ్మద్

బి.కొత్తకోట జనవరి 20 : బి.కొత్తకోట మండలంలోని ఓ సచివాలయ సర్వేయర్ నిర్వాకానికి నిరసగా ఆ గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. గుమ్మసముద్రం పంచాయతీ గండువారిపల్లెలో సర్వే నంబర్ 271, 272లలో గ్రామ పూర్వీకుల సమాధులు, మారెమ్మ గుడి, కనికలమ్మ గుడి ఉన్నాయని గ్రామస్థులందరూ ప్రతి ఏడాది ఇదే ప్రదేశంలో చిట్లాకుప్ప వేసి పశువులకు పండుగ సంక్రాంతి కూడా జరుపుకుంటారన్నారు. అయితే ఇటీవల జరిగిన రీసర్వేలో 1.56 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన శ్రీకంఠం పద్మావతమ్మ పేరున అసైన్‌మెంట్ పట్టా ఆమె పేరున అసైన్ వన్‌బీ సైతం వస్తోందని గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పద్మావతమ్మ కుమారుడు సచివాలయ సర్వేయర్ కాబట్టి దొడ్డి దారిన అక్రమంగా పాస్‌బుక్‌లో నమోదు చేయించుకున్నారని వారు ధర్నాలో ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ రఫిక్ అహ్మద్ స్పందిస్తూ గండువారిపల్లెకు వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఈ భూమి గ్రామానికి అంతటికి చెందినది. అని అక్రమంగా పొందిన పట్టాను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్, ఆర్ఐలు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో పేరును తొలగిస్తామని, భూమికి సంబంధించిన పుర్వాపరాలను విచారించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు. సర్వేయర్ శ్రీవాణి, వీఆర్వో హైదర్‌షా తదితరులు పాల్గొన్నారు.

షర్మిలను కలవడానికి తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు


ర్యాలీగా బయలుదేరుతున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

మదనపల్లె అర్బన్, జనవరి 20: ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా పదవి బాధ్యతలు చేపట్టనున్న వైఎస్‌షర్మిలను కలవడానికి పెద్దఎత్తున్న మదనపల్లె కాంగ్రెస్ నాయకులు ఇడుపులపాయకు బయలుదేరివెళ్లారు. శనివారం మదనపల్లె నియోజకవర్గనాయకుడు ఎస్. రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా స్థానిక బెంగళూరు బస్టాండ్ వద్దకు చేరుకుని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ర్యాలీగా వాహనాల్లో కడపకు బయలుదేరారు. ఈ సందర్భంగా రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరనుండడం శుభపరిణామమని తెలిపారు. 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడం ప్రధాన లక్ష్యంగా పార్టీ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే రెడ్డిసాహెబ్, చలపతి, మీనాకుమారి, వెంకటరమణ, సురేంద్రరెడ్డి, సయ్యద్, సలీం, మహబూబ్ పీర్, మహమ్మద్‌అలీ, నాగరాజ, ఈశ్వరమ్మ, బయ్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో సీసీ కెమెరాల ఏర్పాట్లు పరిశీలన

బి.కొత్తకోట జనవరి 20 : బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల రక్షణ, భద్రతపై నిఘా కోసం ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలను మదనపల్లె ఆర్డీవో మురళి శనివారం పరిశీలించారు. హిల్స్‌లో గాలిబండ, పాత, కొత్త, వ్యూపాయింట్లు, ఫారెస్ట్ గెస్ట్ హౌస్, టూరిజం రెస్టారెంట్ తదితర 11 ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు పనులను పగడ్బందీగా చేయాలన్నారు. హిల్స్‌లో పారిశుధ్య పనుల కోసం ముగ్గురు కార్మికులను సోమవారం నుంచి నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు మునుపు ఆయన బి.కొత్తకోట పట్టణంలో పర్యటించి ఇంటి పట్టాల విష యంలో రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్ రఫిక్ అహ్మద్, ఆర్ఐ బాలాజీ, వీఆర్వోలు నరేంద్రకుమార్, హైదర్‌షా తదితరులు ఉన్నారు.

టి.సదుం రామాలయంలో లోకాయుక్త పూజలు


ప్రత్యేక పూజల్లో లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి దంపతులు

పెద్దతిప్పసముద్రం జనవరి 20 : మండలంలోని టి.సదుం గ్రామంలో వెలసిన శ్రీకోదండ రామాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల ఆయన తన స్వగ్రామమైన చెన్నరాయునిపల్లెకు విచ్చేశారు. శనివారం ఆయన సతీసమేతంగా వెళ్లి శ్రీకోదండరామాలయంలో పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం ఆయన తిరిగి కర్నూల్‌కు వెళుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయన వెంట ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డితో పాటు ఆయన కుమారుడు మనోజ్‌జయంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.